


# పోరు తెలంగాణ
డిజిటల్ తెలుగు దినపత్రిక




కరీంనగర్ సంపుటి : 11 సంచిక : 322 శుక్రవారం 28-08-2026 ఎడిటర్ : కొండ ప్రవీణ్ కుమార్ పేజీలు : 04 వేల : 04

## కుప్పకూలిన ఇరాన్ కరెన్సీ.. ఒక డాలర్‌కు 20 లక్షల రియాల్స్!

- ఇరాన్ కరెన్సీ రియాల్ రికార్డు స్థాయిలో పతనం
- ఒక అమెరికా డాలర్‌కు 20 లక్షల రియాల్స్‌కు చేరిన విలువ
- అమెరికా ఆంక్షలు, యుద్ధం కారణంగా తీవ్రమైన సంక్షోభం
- ఆకాశాన్నంటిన ధరలతో సామాన్యుల అవస్థలు
- జీతాలకు, ఖర్చులకు పొంతన లేక ప్రజల ఇబ్బందులు



ఇరాన్ కరెన్సీ రియాల్ చారిత్రక కనిష్ఠ స్థాయికి పడిపోయింది. ఫ్రీ మార్కెట్‌లో ఒక అమెరికా డాలర్ విలువ ఏకంగా 2 మిలియన్ల (20 లక్షల) ఇరానియన్ రియాల్స్‌కు చేరింది. అమెరికా విధించిన కఠిన ఆంక్షలు, ఇజ్రాయెల్‌తో కొనసాగుతున్న యుద్ధం కారణంగా ఇరాన్ - మిగతా 2 లో

## భూకంపం వచ్చిందా? నేపాల్ జల విలయానికి కారణం ఇదేనా?

- ★నేపాల్‌ను ముంచెత్తిన ఆకస్మిక వరదలు, 22 మంది మృతి
- ★105 మంది భారతీయులతో సహా 348 మంది గల్లంతు
- ★భూకంపంతో కొండచరియలు విరిగిపడటమే కారణమని అనుమానం
- ★నేపాల్‌కు అన్ని విధాలా సాయం అందిస్తామని ప్రధాని మోదీ హామీ
- ★మరోసారి వరద ముప్పు పొంచి ఉందని అధికారుల హెచ్చరిక



పొరుగు దేశం నేపాల్‌లో ప్రకృతి బీభత్సం సృష్టించింది. టిబెట్ సరిహద్దుకు సమీపంలో ఆకస్మిక వరదలు పోటెత్తాయి. రసువా జిల్లాలోని భోటేకోశీ నదిలో సంభవించిన ఈ జల ప్రళయంలో ఇప్పటివరకు 22 మంది - మిగతా 2 లో

## మల్లు భట్టివిక్రమార్కతో భేటీ అందుకే కలిశానన్న రాజగోపాల్ రెడ్డి



- భట్టి విక్రమార్కతో భేటీపై క్లారిటీ ఇచ్చిన రాజగోపాల్ రెడ్డి
- నియోజకవర్గ అభివృద్ధి, నిధుల కోసమే కలిశానని వెల్లడి
- తనది స్వచ్ఛమైన కాంగ్రెస్ రక్తమని వ్యాఖ్య
- కొండా సురేఖ వివాదంపై అధిష్ఠానం నిర్ణయమే ఫైనల్ అని స్పష్టీకరణ

తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతో జరిగిన భేటీపై మునుగోడు ఎమ్మెల్యే - మిగతా 2 లో

## కేసీఆర్ పాలన ప్రజా సంక్షేమంగా సాగితే



- ★ రేవంత్ పాలన భూముల వ్యాపారంగా సాగుతోంది: హరీశ్ రావు
- ★ కాంగ్రెస్ ప్రభుత్వ నిర్ణయాల వల్ల హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ దెబ్బతింటోందన్న హరీశ్
- ★ పార్కులు, ప్లాట్లు, ప్రభుత్వ స్థలాలు కనిపిస్తే అక్కడ భూములను అమ్మేస్తున్నారని ఆరోపణ
- ★ లక్షల ఎకరాల అసైన్డ్ భూములను లాక్కొంటున్నారని మండిపాటు

నాడు కేసీఆర్ పాలన ప్రజా సంక్షేమ కేంద్రంగా సాగితే, ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి పాలన - మిగతా 2 లో

# గ్రామాల నుంచి ఒలింపిక్స్ దాకా!

- కొరియా నేషనల్ స్పోర్ట్స్ యూనివర్సిటీతో యంగ్ ఇండియా స్పోర్ట్స్ వర్సిటీ అవగాహన ఒప్పందం
- 2036 ఒలింపిక్స్‌లో పతకాలు సాధించేలా ప్రోత్సాహం
- ‘ఎక్స్’లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెల్లడి




రాష్ట్రంలోని గ్రామాలు, పట్టణాల్లో ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి.. అంతర్జాతీయ స్థాయి శిక్షణతో వారిని ఒలింపిక్స్ వేదిక వరకు తీసుకెళ్లే దిశగా ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ యూనివర్సిటీ.. దక్షిణ కొరియాలోని ప్రతిష్ఠాత్మక ‘కొరియా నేషనల్ స్పోర్ట్స్ యూనివర్సిటీ (కేఎన్ఎస్‌యూ)’తో అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చుకున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెల్లడించారు. ఇందుకు సంబంధించి బుధవారం ‘ఎక్స్’ వేదికగా కీలక అంశాలను ఆయన పంచుకున్నారు. ప్రపంచ స్థాయి క్రీడా శిక్షణ, స్పోర్ట్స్ సైన్స్, హైపెర్ఫార్మెన్స్ ఎడ్యుకేషన్ తదితర రంగాల్లో ఈ భాగస్వామ్యం

## పోలవరం వద్ద గోదావరికి పోటెత్తుతున్న వరద.. 48 గేట్లు ఎత్తివేత



- రెండు, మూడు రోజులుగా ఎగువ ప్రాంతంలో కురుస్తున్న భారీ వర్షాలు
- పోలవరం ప్రాజెక్ట్ కాఫర్ డ్యామ్ వద్ద 30.30 మీటర్లకు చేరుకున్న గోదావరి నీటిమట్టం
- 4.10 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్న అధికారులు


గత రెండు, మూడు రోజులుగా తెలంగాణతో పాటు ఎగువ ప్రాంతాలలో పడుతున్న భారీ వర్షాల వల్ల గోదావరి నదిలోకి వరద - మిగతా 2 లో

# నేపాల్‌లో జల విలయం
# ప్రధాని బాలేన్ షాతో మాట్లాడిన మోదీ

- నేపాల్‌ను ముంచెత్తిన ఆకస్మిక వరదలు
- 105 మంది భారతీయులు సహా 384 మంది పర్యాటకులు గల్లంతు
- సహాయక చర్యలు ముమ్మరం
- నేపాల్ ప్రధానితో ఫోన్ లో మాట్లాడిన మోదీ, సాయానికి సిద్ధమని ప్రకటన




పొరుగు దేశం నేపాల్‌ను భారీ వరదలు ముంచెత్తాయి. రసువా ప్రాంతంలోని భోటే కోశీ నదిలో బుధవారం ఆకస్మికంగా సంభవించిన వరదల కారణంగా పెను విషాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో




# పోలవరం వద్ద గోదావరికి పోటెత్తుతున్న వరద.. 48 గేట్లు ఎత్తివేత

మొదటిపేజీ తరువాయి – భారీ వర్షాల వల్ల గోదావరి నదిలోకి వరద నీరు పోటెత్తుతుంది. ఈ క్రమంలో పోలవరం ప్రాజెక్టు వద్ద గోదావరి ప్రవాహం తీవ్రతరమైంది. ప్రాజెక్టు పరిధిలోని ఎగువ కాఫర్ డ్యామ్ వద్ద గోదావరి నీటిమట్టం 30.30 మీటర్లకు చేరుకోగా, స్పిల్ వే వద్ద నీటిమట్టం 30.20 మీటర్లుగా నమోదైంది. వరద నీటిని క్రమబద్ధీకరించేందుకు అధికారులు స్పిల్ వేకు చెందిన 48 గేట్లను ఎత్తివేసి, దిగువకు 4.10 లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. గోదావరి వరద ప్రభావంతో దేవీపట్నం మండలంలోని ప్రసిద్ధ గండిపోశమ్మ ఆలయాన్ని వరద నీరు చుట్టుముట్టింది. ఆలయ ప్రాంగణంలోని క్యూ లైన్లు, చుట్టుపక్కల ఉన్న దుకాణాలు పూర్తిగా నీట మునిగిపోయాయి. పి.గొందూరు నుంచి నాగులపల్లి గ్రామాల మధ్య రహదారిపైకి వరద నీరు చేరుకోవడంతో అమ్మవారి ఆలయానికి వెళ్లే దారిలో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. నదిలో నీటిమట్టం మరింత పెరిగే అవకాశం ఉన్నందున, పర్యాటకుల భద్రత దృష్ట్యా పాపికొండల విహారయాత్రకు వెళ్లే బోట్ల రాకపోకలను నిలిపివేసేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

# కేసీఆర్ పాలన ప్రజా సంక్షేమంగా సాగితే

మొదటిపేజీ తరువాయి – భూముల వ్యాపారం కేంద్రంగా నడుస్తోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు తీవ్రస్థాయిలో విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాల వల్ల హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ దెబ్బతింటోందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని కూకట్‌పల్లిలో ఈరోజు ఏర్పాటు చేసిన 22ఏ బాధితుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో ఎక్కడ పార్కులు, ప్లాట్లు, ప్రభుత్వ స్థలాలు కనిపిస్తే అక్కడ భూములను విక్రయిస్తూ భావి తరాలకు కనీసం స్థలం కూడా లేకుండా చేస్తున్నారని హరీశ్ రావు ఆరోపించారు. సామాన్య ప్రజల ఆస్తులనేమో 22ఏ నిషేధిత జాబితాలోకి నెడుతూ, ప్రభుత్వ భూములను మాత్రం ముఖ్యమంత్రి సోదరుల చేతుల్లోకి వెళ్లేలా చేస్తున్నారని విమర్శించారు. లక్షలాది ఎకరాల అసైన్డ్ భూములను పేదల వద్ద నుంచి లాక్కొని, కమీషన్ల కోసం పారిశ్రామికవేత్తలకు కట్టబెడుతున్నారని మండిపడ్డారు. ఎప్పుడు 'హైడ్రా' వచ్చి ఇళ్లను కూలుస్తుందో, ఎప్పుడు 22ఏ పేరుతో తమ భూములను గుంజుకుంటారోనని ప్రజలు భయాందోళనలతో బతుకుతున్నారని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు కోటి ఎకరాలను, ఒక్క హైదరాబాద్‌లోనే లక్షలాది ఆస్తులను రేవంత్ ప్రభుత్వం 22ఏ జాబితాలో చేర్చిందని ఆరోపించారు. ప్రభుత్వం చేసిన తప్పుకు ప్రజలను ప్రభుత్వ ఆఫీసుల చుట్టూ తిప్పుతూ... జాబితా నుంచి భూములను తొలగించడానికి 30 శాతం వరకు కమీషన్లు వసూలు చేస్తున్నారని విమర్శించారు. సెప్టెంబర్ 7వ తేదీ నుంచి ప్రారంభం కానున్న అసెంబ్లీ సమావేశాల్లో ఈ 22ఏ అంశంపై ప్రభుత్వాన్ని తీవ్రంగా నిలదీస్తామని స్పష్టం చేశారు. బాధితులు ఎవరూ బ్రోకర్లకు ఒక్క రూపాయి కూడా ఇవ్వొద్దని, ప్రజల ఆస్తులను కాపాడే బాధ్యతను బీఆర్ఎస్ పూర్తిగా తీసుకుంటుందని హామీ ఇచ్చారు.

# మల్లు భట్టివిక్రమార్కతో భేటీ.. అందుకే కలిశానన్న రాజగోపాల్ రెడ్డి

మొదటిపేజీ తరువాయి – కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి స్పష్టత ఇచ్చారు. బుధవారం ప్రజాభవన్‌లో ఉపముఖ్యమంత్రిని కలిసిన ఆయన, కేవలం నియోజకవర్గ అభివృద్ధి, నిధుల కేటాయింపులపై చర్చించేందుకే ఈ భేటీ జరిగిందని వివరించారు. అనంతరం మీడియాతో మాట్లాడిన రాజగోపాల్ రెడ్డి, తాను కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేస్తున్న సీనియర్ నాయకుడినని పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను తాను తీవ్రంగా వ్యతిరేకించానని, 2018 ఎన్నికల్లో ఎంతోమంది సీనియర్లు ఓటమి పాలైనప్పటికీ మునుగోడు ప్రజలు తన వెంటే నిలిచారని ఆయన గుర్తుచేశారు. తన వ్యాఖ్యలు పార్టీ బలోపేతం కోసమే తప్ప, ఎవరినీ వ్యక్తిగతంగా విమర్శించేందుకు కాదని స్పష్టం చేశారు. "మాది స్వచ్ఛమైన కాంగ్రెస్ రక్తం. ఎన్నికల సమయంలో కొత్తగా వచ్చిన వారికి టికెట్లు కేటాయించారు. అయితే, పార్టీని నమ్ముకున్న కార్యకర్తలను కాపాడుకోవాల్సిన బాధ్యత నాయకత్వంపై ఉంది" అని ఆయన వ్యాఖ్యానించారు. మంత్రి కొండా సురేఖకు సంబంధించిన వివాదంపై స్పందిస్తూ, ఈ విషయంలో పార్టీ అధిష్ఠానం నిర్ణయమే అంతిమమని రాజగోపాల్ రెడ్డి పేర్కొన్నారు. ఈ అంశంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికే స్పందించారని, క్రమశిక్షణ సంఘం కూడా సంబంధిత వ్యాఖ్యలపై పీసీసీకి నివేదిక సమర్పించిందని తెలిపారు. తనపై విమర్శలు చేసే వారు ముందుగా ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచించిన ఆయన, తాను ఎల్లప్పుడూ పార్టీ క్రమశిక్షణకు కట్టుబడి ఉంటానని వెల్లడించారు. రాహుల్ గాంధీని దేశ ప్రధానిని చేయడమే తమ ప్రధాన లక్ష్యమని రాజగోపాల్ రెడ్డి పునరుద్ఘాటించారు.

# కుప్పకూలిన ఇరాన్ కరెన్సీ.. ఒక డాలర్‌కు 20 లక్షల రియాల్స్!

మొదటిపేజీ తరువాయి – ఆర్థిక వ్యవస్థ తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయింది. ఈ పరిణామాలతో సుమారు 9.2 కోట్ల జనాభా ఉన్న ఆ దేశంలో ప్రజల జీవనం దుర్భరంగా మారింది. అల్ జజీరా ప్రచురించిన ఒక కథనం ప్రకారం, దశాబ్దాలుగా కొనసాగుతున్న అంతర్జాతీయ ఆంక్షలు, ముఖ్యంగా అణు కార్యక్రమంపై విధించిన ఆంక్షలు ఇప్పటికే ఇరాన్ ఆర్థిక వ్యవస్థను బలహీనపరిచాయి. దీనికి తోడు, ఈ ఏడాది ఫిబ్రవరి 28న ప్రారంభమైన యుద్ధం పరిస్థితిని మరింత దిగజార్చిందని ఆ కథనం పేర్కొంది. కరెన్సీ విలువ పడిపోవడంతో దేశంలో ద్రవ్యోల్బణం విపరీతంగా పెరిగిపోయింది. ఈ కరెన్సీ పతనం సామాన్యుడి జీవితంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. యుద్ధానికి ముందు 2 మిలియన్ల రియాల్స్‌కు దాదాపు 4 కిలోల టమాటాలు, అర కిలో చికెన్, లీటర్ వంట నూనె వచ్చేవి. కానీ ఇప్పుడు అవే డబ్బులకు వాటిలో సగం కూడా రావడం లేదని ప్రజలు వాపోతున్నారు. టమాటాల ధర 71 శాతం, చికెన్ ధర 74 శాతం, వంట నూనె ధర 177 శాతం పెరిగాయి. నిత్యావసరాలకే ఈ పరిస్థితి ఉంటే, మందుల ధరల పెరుగుదల మరింత తీవ్రంగా ఉంది. ఉదాహరణకు, ఇన్సులిన్ ధర 642 శాతం పెరిగింది. ధరల పెరుగుదలతో ప్రజలు మాంసం, చికెన్, కొత్త బట్టలు వంటివి కొనడం పూర్తిగా తగ్గించుకున్నారు. ప్రభుత్వ కనీస వేతనం నెలకు సుమారు 166 మిలియన్ రియాల్స్ (దాదాపు 82 డాలర్లు) ఉండగా, ఖర్చులు మాత్రం ఆకాశాన్నంటాయి. టెహరాన్‌లోని ఒక రిటైల్ వ్యాపారి తన అమ్మకాలు 40 శాతం పడిపోయాయని, చాలా వ్యాపారాలు మూతపడే ప్రమాదంలో ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీర్ఘకాలిక ఆంక్షలు, యుద్ధం వల్ల దెబ్బతిన్న ఉత్పత్తి, అమెరికా నౌకాదళ దిగ్బంధనం, అంతర్జాతీయ మార్కెట్లకు దూరం కావడం వంటివి ఈ సంక్షోభానికి ప్రధాన కారణాలని విశ్లేషకులు చెబుతున్నారు. నెల జీతంతో నెల రోజుల అవసరాలు ఎంతవరకు తీరుతాయన్నదే ఇప్పుడు ఇరాన్ ప్రజల ముందున్న అతిపెద్ద ప్రశ్నగా మారింది. కాగా, ఇరాన్‌లో పెద్ద సంఖ్యలను సులభంగా చెప్పేందుకు 10 రియాల్స్‌ను ఒక "టోమన్"గా వ్యవహరిస్తుంటారు.

# ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భగవత్ సభపై న్యూయార్క్‌లో వివాదం

మొదటిపేజీ తరువాయి – భగవత్ పాల్గొననున్న కార్యక్రమంపై అమెరికాలో వివాదం రాజుకుంది. న్యూయార్క్‌లోని ప్రఖ్యాత మాడిసన్ స్క్వేర్ గార్డెన్‌లో జరగనున్న ఈ వేడుకను న్యూయార్క్ నగర మేయర్ జోహ్రాన్ మమ్దానీ వ్యతిరేకించడంపై అమెరికన్ గాయని, నటి మేరీ మిల్బెన్ తీవ్రంగా స్పందించారు. ప్రధాని నరేంద్ర మోదీ, బీజేపీపై ఉన్న రాజకీయ వ్యతిరేకతతోనే ఈ కార్యక్రమాన్ని అడ్డుకోవాలని చూస్తున్నారని ఆమె ఆరోపించారు. సామాజిక మాధ్యమ వేదిక 'ఎక్స్' ద్వారా స్పందించిన మేరీ మిల్బెన్, "మేయర్ మమ్దానీ వంటి సోషలిస్టులు భారత ప్రధాని నరేంద్ర మోదీని, బీజేపీని వ్యతిరేకిస్తున్నందునే ఈ సభను అడ్డుకుంటున్నారు. మాడిసన్ స్క్వేర్ గార్డెన్ ఒక ప్రైవేట్ సంస్థ. అది సోషలిస్టుల అభీష్టానుసారం కాకుండా పెట్టుబడిదారీ విధానంలో నడుస్తుంది. కాబట్టి ఈ కార్యక్రమం జరిగి తీరుతుంది" అని స్పష్టం చేశారు. "మీరు కూడా పెట్టుబడిదారులుగా ఎదిగి, నిధులు సమకూర్చుకుని, మాడిసన్ స్క్వేర్‌ను అద్దెకు తీసుకుని మీ మోదీ వ్యతిరేక ర్యాలీలు నిర్వహించుకోండి" అని ఆమె చురక అంటించారు. ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా, "యూనివర్సల్ వన్ నెస్ సెలబ్రేషన్" పేరుతో ఆగస్టు 29న ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. సుమారు 5,000 మంది ప్రవాస భారతీయులు హాజరవుతారని అంచనా వేస్తున్న ఈ వేడుక కోసం మోహన్ భగవత్ ఇప్పటికే న్యూయార్క్ చేరుకున్నారు. మరోవైపు, ఈ కార్యక్రమానికి తాను మద్దతు ఇవ్వడం లేదని మేయర్ మమ్దానీ స్పష్టం చేశారు. తాను చూసిన భారతదేశం అందరినీ కలుపుకుపోయే లౌకిక గణతంత్రమని, అయితే ప్రస్తుతం పెరుగుతున్న మినహాయింపువాదం ఆందోళన కలిగిస్తోందని ఆయన వ్యాఖ్యానించారు. పలు పౌర, మానవ హక్కుల సంఘాలు సైతం ఈ కార్యక్రమాన్ని రద్దు చేయాలంటూ మాడిసన్ స్క్వేర్ గార్డెన్ యాజమాన్యంపై ఒత్తిడి తీసుకువస్తున్నాయి.

# ఇక రాష్ట్రమంతటా 'సంజీవని'.. సీఎం చంద్రబాబు కీలక ఆదేశాలు



మొదటిపేజీ తరువాయి – కుప్పం, చిత్తూరు నియోజకవర్గాల్లో ప్రయోగాత్మకంగా అమలు చేసిన ఈ ప్రాజెక్టు అద్భుతమైన ఫలితాలు ఇవ్వడంతో, దీనిని రాష్ట్రమంతా విస్తరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు సంబంధించిన 90 రోజుల కార్యాచరణ ప్రణాళికను అధికారులు సీఎంకు వివరించారు. ఈ సమీక్ష సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ, ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) ఆధారిత ఆరోగ్య సేవలు, ప్రతి పౌరునికి డిజిటల్ హెల్త్ రికార్డులు, వ్యాధుల ముందస్తు గుర్తింపు, సరైన చికిత్స, ఆ తర్వాత ఫాలో-అప్‌కు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు. డిజిటల్ హెల్త్ రికార్డులతో ఈ ప్రాజెక్టును పూర్తిస్థాయిలో అమలు చేస్తే వైద్య సేవల్లో పెను మార్పులు తీసుకురావచ్చని, దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఆంధ్రప్రదేశ్ ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. ప్రజల ఆరోగ్య సమాచారం యొక్క గోప్యతకు, భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని చంద్రబాబు అధికారులను గట్టిగా ఆదేశించారు. ప్రతి వ్యక్తి ఆరోగ్యానికి సంబంధించిన అప్‌డేట్‌లను నేరుగా వారి మొబైల్ ఫోన్‌లకే పంపేలా వ్యవస్థను తీర్చిదిద్దాలని సూచించారు. వ్యాధులను ముందుగానే గుర్తించి, నివారణ చర్యలు చేపట్టడం, సరైన సమయంలో చికిత్స అందించడం ద్వారా కుటుంబాలపై పడే వైద్య, విద్యా ఖర్చుల భారాన్ని గణనీయంగా తగ్గించవచ్చని ప్రభుత్వం భావిస్తోంది. ఈ లక్ష్య సాధనలో 'సంజీవని' ప్రాజెక్టు కీలక పాత్ర పోషిస్తుందని ప్రభుత్వం విశ్వసిస్తోంది.

# ఆ శాఖకు నేను సంరక్షకుడిని మాత్రమే

మొదటిపేజీ తరువాయి – సంరక్షకుడిని (కస్టోడియన్) మాత్రమేనని, తనకు అప్పగించిన బాధ్యతలను మరింత మెరుగైన స్థితికి తీసుకెళ్లడమే తన లక్ష్యమని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్, మానవ వనరుల శాఖల మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. పెట్టుబడుల ఆకర్షణలో స్పీడ్, సర్వీస్, స్టెబిలిటీ అనే మూడు సూత్రాలే తమ విజయ రహస్యాలని ఆయన వెల్లడించారు. దేశంలోని యువ వ్యాపారవేత్తలు, ప్రతిభావంతులకు ఫార్చ్యూన్ ఇండియా సంస్థ '40 అండర్ 40' పేరుతో ముంబైలో అవార్డుల ప్రదానోత్సవాన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమానికి కేంద్ర ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి చిరాగ్ పాశ్వాన్, మంత్రి నారా లోకేశ్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ వేడుకలో భాగంగా, డైరీ రంగంలో విలువ ఆధారిత ఉత్పత్తుల విభాగంలో హెరిటేజ్ సంస్థ సాధించిన ప్రగతికి గాను, ఆ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నారా బ్రహ్మణికి కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్ చేతుల మీదుగా 'ఫార్చ్యూన్ ఇండియా 40 అండర్ 40' అవార్డును ప్రదానం చేశారు.ఏపీ పెట్టుబడుల రహస్యం ఇదే అనంతరం జరిగిన ఇంటరాక్టివ్ సెషన్‌లో మంత్రి లోకేశ్ పాల్గొన్నారు. ఆర్పీఎస్జీ గ్రూప్ వైస్ చైర్మన్ శాశ్వత్ గోయెంకా అడిగిన పలు ప్రశ్నలకు ఆయన ఆసక్తికర సమాధానాలిచ్చారు. "ప్రభుత్వ నిర్వహణలో మీరు క్రమశిక్షణ పాటిస్తున్నారు. పొదుపు గురించి మాట్లాడారు. ఈ ఆలోచన మీకు ఎక్కడి నుంచి వచ్చింది?" అని గోయెంకా ప్రశ్నించగా, లోకేశ్ బదులిచ్చారు. "వ్యాపారంలో అయినా, రాజకీయాల్లో అయినా మనం నిర్వహించే సంస్థలకు కేవలం సంరక్షకులం మాత్రమేనని నేను బలంగా నమ్ముతాను. ఒక మంత్రిగా నేను ఇక్కడికి వచ్చింది కేవలం మానవ వనరుల అభివృద్ధి, విద్యాశాఖకు సంరక్షకుడిగా మాత్రమే. గతంలో వ్యాపారంలో, ఇప్పుడు ప్రభుత్వ బాధ్యతల్లోనూ ఇదే విధానాన్ని అనుసరిస్తున్నాను" అని వివరించారు. పెట్టుబడుల కోసం అన్ని రాష్ట్రాలు పోటీ పడుతున్న తరుణంలో ఆంధ్రప్రదేశ్‌ను ప్రత్యేకంగా నిలబెట్టేది ఏమిటన్న ప్రశ్నకు లోకేశ్ రెండు ప్రధాన కారణాలను తెలిపారు. "మొదటిది, మేము అనుసరించే మూడు 'ఎస్'ల విధానం. స్పీడ్ (వేగం), సర్వీస్ (సేవ), స్టెబిలిటీ (స్థిరత్వం). మేము ఎంత వేగంగా అనుమతులు ఇస్తున్నామో చాలా పరిశ్రమలకు తెలుసు. ఇక సర్వీస్ విషయానికొస్తే, పెట్టుబడిదారులకు వారి ప్రాజెక్టుల పురోగతిపై ప్రతి శనివారం రాత్రి నేనే స్వయంగా మెసేజ్ పంపి ఫీడ్‌బ్యాక్ ఇస్తాను. మూడోది, విధానాల్లో స్థిరత్వం. ప్రభుత్వాలు మారినా మా విధానాలు కొనసాగుతాయి. ఇది పెట్టుబడిదారులకు భరోసా ఇస్తుంది" అని లోకేశ్ అన్నారు. "రెండో ముఖ్య కారణం ముఖ్యమంత్రి చంద్రబాబు గారు. సీబీఎన్ అంటే అదొక బ్రాండ్. ఆయనకు అద్భుతమైన ట్రాక్ రికార్డు ఉంది. పెట్టుబడులకు అవసరమైన తలుపులు తెరువగల ముఖ్యమంత్రి ఉండటంతో మా పని సగం సులభమవుతుంది. మిగిలిన సగం పనిని నేను సమావేశ మందిరంలో ఒప్పందాన్ని ఖరారు చేయడం ద్వారా పూర్తి చేస్తాను. మా ఇద్దరి భాగస్వామ్యమే ఆంధ్రప్రదేశ్‌ను ప్రత్యేకంగా నిలుపుతోంది" అని లోకేశ్ తెలిపారు. కుటుంబ వ్యాపారాల్లో ఉన్న యువత తమ కంఫర్ట్ జోన్ నుంచి బయటకు వచ్చి, కొత్త రంగాల్లో పరిశోధనలపై భారీగా పెట్టుబడులు పెట్టాలని లోకేశ్ పిలుపునిచ్చారు. అంతరిక్షం, క్వాంటమ్ టెక్నాలజీ, మెటీరియల్ సైన్సెస్ వంటి రంగాల్లో భారతదేశం ఎంతో సాధించగలదని ఆశాభావం వ్యక్తం చేశారు. "రేపటి తరం గర్వపడేలా ఆంధ్రప్రదేశ్‌లో అమరావతి నగరం చరిత్ర సృష్టించబోతోంది. ప్రపంచమంతా చెప్పుకునేలా ఒక మోడల్‌ను ఏపీలో నిర్మించాలన్నది మా లక్ష్యం. ఈ మార్పులో మీరంతా భాగస్వాములు కావాలి. మేము చేసే ప్రతి తప్పు నుంచి నేర్చుకోవడానికి, రాష్ట్రాన్ని మరింత మెరుగ్గా తీర్చిదిద్దడానికి మీ సలహాలు స్వీకరించడానికి సిద్ధంగా ఉన్నాం" అని యువ పారిశ్రామికవేత్తలను ఉద్దేశించి లోకేశ్ అన్నారు.

# భూకంపం వచ్చిందా? నేపాల్ జల విలయానికి కారణం ఇదేనా?

మొదటిపేజీ తరువాయి – ప్రాణాలు కోల్పోగా, 105 మంది భారతీయులతో సహా దాదాపు 348 మంది గల్లంతయ్యారు. ఈ ఘటనతో రసువాతో పాటు ధాదింగ్, నువాకోట్ జిల్లాల్లో తీవ్ర నష్టం వాటిల్లింది. ఈ ఆకస్మిక వరదల్లో అనేక గ్రామాలు, వంతెనలు, రోడ్లు, జలవిద్యుత్ ప్రాజెక్టులు కొట్టుకుపోయాయి. బురద, శిథిలాల కింద అనేక మంది చిక్కుకుపోయారు. గల్లంతైన వారిలో 105 మంది భారతీయులు, 93 మంది నేపాల్ పౌరులు, 12 మంది బ్రిటిష్, ముగ్గురు అమెరికన్ పౌరులు ఉన్నట్లు అధికారులు తెలిపారు.

**భూకంపమే కారణమా?**

ఈ దుర్ఘటనకు భూకంపం ప్రేరేపిత కొండచరియలే కారణమని నేపాల్ విదేశాంగ మంత్రి షిషిర్ ఖనాల్ పార్లమెంటుకు వివరించారు. స్థానిక కాలమానం ప్రకారం బుధవారం ఉదయం 8:30 గంటల సమయంలో టిబెట్ భూభాగంలో 4.4 తీవ్రతతో భూకంపం సంభవించినట్లు యూఎస్ జియలాజికల్ సర్వే (ఖూ+ూ) నమోదు చేసింది. ఈ భూకంపం ధాటికి భారీగా మంచు, రాళ్లతో కూడిన కొండచరియలు విరిగిపడి టిబెట్ వైపు ఉన్న లెండే ఖోలా నది ప్రవాహానికి అడ్డుపడ్డాయి. దీంతో తొలుత నీరు భారీగా నిలిచిపోయింది. ఆ ప్రవాహం అంతకంతకు అధికం కావడంతో, ఆ అడ్డుకట్ట ఒక్కసారిగా తెగిపోయింది. దాంతో భోటేకోశీ నదిలోకి వరద పోటెత్తిందని ప్రాథమికంగా నిర్ధారించారు.

**సహాయక చర్యలు.. భారత్ అండ**

నేపాల్ సైన్యం, పోలీసులు సహాయక చర్యలు చేపట్టారు. అయితే, వరద ఉద్ధృతి తగ్గకపోవడంతో హెలికాప్టర్లు దిగలేని పరిస్థితి నెలకొంది. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రదేశాలకు తరలిస్తున్నారు. ఈ ఘటనపై భారత ప్రధాని నరేంద్ర మోదీ, నేపాల్ ప్రధాని బాలెన్ షాతో ఫోన్‌లో మాట్లాడి సంతాపం తెలిపారు. అన్ని రకాల మానవతా సహాయాన్ని అందిస్తామని హామీ ఇచ్చారు. నిత్యావసరాలు, మందులతో పాటు ఎన్డీఆర్ఎఫ్ బృందాలను పంపే అంశాన్ని భారత్ పరిశీలిస్తోంది. మరోవైపు, చైనా కూడా సరిహద్దుల్లో సహాయక బృందాలను మోహరించింది. కాగా, నది ఎగువన ఇంకా అవరోధాలు ఉండటంతో మరోసారి వరద వచ్చే ప్రమాదం ఉందని అధికారులు హెచ్చరిస్తున్నారు. ఈ నేపథ్యంలో బీహార్, ఉత్తరప్రదేశ్ వంటి భారత సరిహద్దు రాష్ట్రాల్లోనూ వరద హెచ్చరికలు జారీ చేశారు.

# నేపాల్‌లో జల విలయం ప్రధాని బాలేన్ షాతో మాట్లాడిన మోదీ

మొదటిపేజీ తరువాయి – 100 మందికి పైగా భారతీయులతో సహా వందలాది మంది పర్యాటకులు గల్లంతయ్యారు. ఈ విపత్కర పరిస్థితుల్లో నేపాల్‌కు అండగా నిలుస్తామని భారత ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించారు. బుధవారం నేపాల్ ప్రధాని బాలేంద్ర షాతో ప్రధాని మోదీ ఫోన్‌లో మాట్లాడారు. వరదల కారణంగా ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు తన ప్రగాఢ సంతాపం తెలిపారు. నేపాల్‌కు అవసరమైన అన్ని రకాల మానవతా సాయం అందించేందుకు భారత్ సిద్ధంగా ఉందని ఆయన హామీ ఇచ్చారు. "ఈ కష్టకాలంలో నేపాల్ సోదర సోదరీమణులకు భారత ప్రజలు తోడుగా ఉంటారు. సహాయక చర్యల కోసం మన బృందాలు సమన్వయంతో పనిచేస్తున్నాయి" అని మోదీ ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు. నేపాల్ టూరిజం బోర్డు (ఎన్టీబీ) విడుదల చేసిన ప్రాథమిక నివేదిక ప్రకారం, ఈ వరదల్లో మొత్తం 384 మంది పర్యాటకులు గల్లంతయ్యారు. వీరిలో 105 మంది భారతీయులు, 93 మంది నేపాల్ పౌరులు, మిగిలిన వారు విదేశీయులు ఉన్నారు. గల్లంతైన విదేశీయులలో యూకే, ఆస్ట్రేలియా, అమెరికా, మలేషియా, దక్షిణాఫ్రికా, నెదర్లాండ్స్ దేశాలకు చెందిన వారు ఉన్నట్లు అధికారులు తెలిపారు. అయితే, ఈ సంఖ్య ప్రాథమికమైనదేనని, ట్రావెల్ ఏజెన్సీలు, స్థానిక అధికారులతో కలిసి వివరాలను ధ్రువీకరిస్తున్నామని ఎన్టీబీ స్పష్టం చేసింది. గల్లంతైన వారు తొమ్మిది వేర్వేరు ట్రావెల్ ఏజెన్సీల ద్వారా నేపాల్ పర్యటనకు వచ్చారని ప్రాథమిక సమాచారం. కాఠ్మండు టైమ్స్ కథనం ప్రకారం, ఈ దుర్ఘటనలో ఇప్పటివరకు ఏడుగురు మరణించినట్లు నిర్ధారణ అయింది. గల్లంతైన వారి ఆచూకీ కోసం అధికారులు, సహాయక బృందాలు ముమ్మరంగా గాలింపు చర్యలు కొనసాగిస్తున్నాయి. సమాచారం లేదా సహాయం కోసం పర్యాటకులు, వారి కుటుంబ సభ్యుల కోసం నేపాల్ టూరిజం బోర్డు పలు ఎమర్జెన్సీ నంబర్లను (1234, 1144, 9851289445) జారీ చేసింది. వరద ప్రభావిత ప్రాంతాల్లోని పర్యాటకులు ఆందోళన చెందవద్దని, అధికారిక ప్రకటనలను అనుసరించాలని సూచించింది.

# 'భారత్ ధర్మశాల కాదు': 2047కు అమిత్ షా భారీ భద్రతా బ్లూప్రింట్

మొదటిపేజీ తరువాయి – అని కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. చొరబాట్లు, ఉగ్రవాదం, మాదకద్రవ్యాల అక్రమ రవాణా, భవిష్యత్ భద్రతా సవాళ్లపై ఇప్పటి నుంచే ముందస్తు వ్యూహాలతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఢిల్లీలో జరిగిన ఇంటెలిజెన్స్ బ్యూరో 'జాతీయ భద్రతా సదస్సు' ముగింపు సమావేశంలో ఆయన మాట్లాడారు.

**ముప్పు రాకముందే చర్యలు**

మరో 15 నుంచి 20 ఏళ్లలో ఎదురయ్యే భద్రతా సవాళ్లను ఇప్పటి నుంచే గుర్తించాలని అమిత్ షా సూచించారు. అవి పెద్ద సంక్షోభాలుగా మారకముందే తిప్పికొట్టే వ్యూహాలు సిద్ధం చేయాలని చెప్పారు. దేశంలో మూడు ప్రధాన అంతర్గత భద్రతా హాట్‌స్పాట్ల నుంచి ఎదురైన ముప్పులను సమర్థంగా అధిగమించామని పేర్కొన్నారు.

**'ఇది ధర్మశాల కాదు'**

సరిహద్దు భద్రతపై కేంద్రం ప్రత్యేక దృష్టి పెట్టిందని షా తెలిపారు. ఎనిమిది నెలలుగా అన్ని భూ సరిహద్దు రాష్ట్రాలతో సంప్రదింపులు జరిపామని చెప్పారు. నాలుగు అంచెల సరిహద్దు భద్రతా ప్రణాళికను రాష్ట్రాలకు అందించామని వెల్లడించారు. "ఇది ధర్మశాల కాదు. ఈ దేశ పౌరులకు మాత్రమే ఇక్కడ నివసించే హక్కు ఉంది" అని షా వ్యాఖ్యానించారు. అక్రమ చొరబాటుదారులు జాతీయ భద్రత, ఆర్థిక స్థిరత్వం, జనాభా సమతుల్యతకు ముప్పని హెచ్చరించారు.

**3 ఏళ్లలో కేసుల పరిష్కారమే లక్ష్యం**

కొత్తగా తెచ్చిన మూడు క్రిమినల్ చట్టాలను వచ్చే ఏడాదిలో పూర్తిస్థాయిలో అమలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు షా చెప్పారు. క్రిమినల్ కేసులు సుప్రీంకోర్టు స్థాయి వరకు మూడేళ్లలో పరిష్కారమయ్యేలా వ్యవస్థను తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. శిక్షల శాతాన్ని 25 శాతం పెంచడమూ లక్ష్యమేనన్నారు.

**ఉగ్రవాదం, డ్రగ్స్‌పై ఉక్కుపాదం**

పీఎఫ్ఐపై నిషేధం తర్వాత చేపట్టిన చర్యలను కేంద్ర-రాష్ట్ర సమన్వయానికి ఉదాహరణగా షా పేర్కొన్నారు. ఉగ్రవాద నెట్‌వర్క్‌లను పూర్తిగా ధ్వంసం చేసేందుకు 'ప్రహార్' వ్యూహాన్ని రోజువారీ భద్రతా కార్యకలాపాల్లో అమలు చేయాలని సూచించారు. మాదకద్రవ్యాలపై 'డిటెక్ట్, డిస్‌రప్ట్, డిస్ట్రాయ్' విధానాన్ని అనుసరించాలని రాష్ట్రాలకు పిలుపునిచ్చారు. 2026-29 మాదకద్రవ్య నియంత్రణ విజన్ డాక్యుమెంట్‌ను క్షేత్రస్థాయిలో అమలు చేయాలని ఆదేశించారు.

**ఏఐతో కొత్త భద్రతా కవచం**

సీసీటీఎన్ఎస్, ఐసీజేఎస్, నాట్‌గ్రిడ్, నాఫిస్ డేటాబేస్‌ల అనుసంధానంతో శక్తిమంతమైన నిఘా వ్యవస్థ ఏర్పడిందని షా తెలిపారు. కృత్రిమ మేధ, డేటా విశ్లేషణ, ప్రవర్తనా సరళి అధ్యయనం ద్వారా భవిష్యత్ ముప్పులను ముందే గుర్తించాలని యువ అధికారులకు సూచించారు.

# గ్రామాల నుంచి ఒలింపిక్స్ దాకా!

దోహదపడుతుందన్నారు. తెలంగాణ క్రీడా ప్రతిభకు ప్రపంచస్థాయి శిక్షణ, క్రీడా విజ్ఞానం, అత్యుత్తమ శిక్షణ విధానాలను అనుసంధానించే వారధిగా ఈ భాగస్వామ్యం నిలుస్తుందన్నారు. అథ్లెట్ ట్రైనింగ్, స్పోర్ట్స్ సైన్స్, హైపెర్ఫార్మెన్స్ ఎడ్యుకేషన్‌లో కేఎన్ఎ?సయూ అనుభవాన్ని తెలంగాణ యువ క్రీడాకారులకు అందుబాటులోకి తీసుకురావాలన్నదే తమ లక్ష్యమని పేర్కొన్నారు. గత దక్షిణ కొరియా పర్యటన సందర్భంగా తాను, కేఎన్ఎ?సయూ ఉన్నత ప్రతినిధి బృందంతో సమావేశమైన విషయాన్ని సీఎం గుర్తుచేశారు. కేఎన్ఎస్‌యూ అధ్యక్షుడు మూన్ వోన్-జే సహా ఉన్నతస్థాయి ప్రతినిధులతో అప్పట్లో విస్తృత చర్చలు జరిపినట్లు తెలిపారు. ప్రతిపాదిత యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీతో, కేఎన్ఎ?సయూ భాగస్వామ్యంపై ఆ సందర్భంగా చర్చలు జరిగాయని, ఇప్పుడు అవి ఎంవోయూ రూపంలో కార్యరూపం దాల్చాయని వెల్లడించారు.

**32 పతకాల్లో 16 కేఎన్ఎస్‌యూకే..**

ప్రపంచ క్రీడా రంగంలో కేఎన్ఎస్‌యూకు ఉన్న ప్రాధాన్యాన్ని పారిస్ ఒలింపిక్స్ ఫలితాలు చాటి చెబుతున్నాయని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. పారిస్ ఒలింపిక్స్‌లో దక్షిణ కొరియా సాధించిన 32 పతకాల్లో 16 పతకాలు కేఎన్ఎ?సయూలో శిక్షణ పొందిన క్రీడాకారులే సాధించారని తెలిపారు. అదే తరహా క్రీడా నైపుణ్యం, అత్యుత్తమ ప్రదర్శన సంస్కృతిని తెలంగాణలోనూ తీసుకురావాలన్నదే తమ లక్ష్యమన్నారు. ఈ కీలక భాగస్వామ్యానికి కృషి చేసిన క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, ఆ శాఖ అధికారులు, యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ ప్రతినిధులను ఈ సందర్భంగా సీఎం అభినందించారు. ప్రపంచ క్రీడా ప్రమాణాలను తెలంగాణ యువ క్రీడాకారులకు చేరువ చేసేందుకు ఈ ఒప్పందం కొత్త అవకాశాలను తెరుస్తుందని అభిప్రాయపడ్డారు. భారత్ 2036 ఒలింపిక్స్ వైపు అడుగులు వేస్తున్న నేపథ్యంలో తెలంగాణ కూడా అందుకు సిద్ధమవుతోందని తెలిపారు. ప్రపంచంలోనే అత్యంత ప్రతిష్ఠాత్మకమైన క్రీడా ఈవెంట్‌కు ఆతిథ్యమివ్వడమే కాకుండా.. భారత్‌కు గర్వకారణంగా నిలిచే క్రీడాకారులను తయారు చేయడమే

# అంతంపల్లి PACS నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారం

## రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యం: ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్....





**కామారెడ్డి జిల్లా ప్రతి నిధి ఆగస్టు 27.(పోరు తెలంగాణ న్యూస్:):** కామారెడ్డి నియోజకవర్గంలోని అంతంపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (ప్యాక్స్) నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవం ఘనంగా జరిగింది. కార్యక్రమానికి తెలంగాణ ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ ముఖ్య అతిథిగా హాజరై నూతన పాలకవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నూతన ప్యాక్స్ చైర్మన్‌గా చిట్టెడి సుధాకర్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేయగా, నూతన పాలకవర్గ సభ్యులు కూడా ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు స్వీకరించారు. అనంతరం షబ్బీర్ అలీమాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. రైతు ఆర్థికంగా బలపడితేనే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని పేర్కొన్నారు. రైతులకు అవసరమైన పంట రుణాలు, విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ సేవలు సకాలంలో అందించడంలో ప్యాక్సులు కీలక పాత్ర పోషించాలని సూచించారు. ప్యాక్సులు కేవలం రుణాలు అందించే సంస్థలుగా కాకుండా రైతుల సమగ్ర అభివృద్ధికి తోడ్పడే కేంద్రాలుగా పనిచేయాలని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని రైతు భరోసా, పంట రుణమాఫీ, ఉచిత విద్యుత్, రైతు బీమా, సాగునీటి వనరుల అభివృద్ధి వంటి కార్యక్రమాలను అమలు చేస్తోందని షబ్బీర్ అలీ తెలిపారు. రైతులకు మెరుగైన మార్కెట్ సదుపాయాలు, మౌలిక వసతులు కల్పించడంతో పాటు గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిని వేగవంతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. అంతంపల్లి ప్యాక్స్ నూతన చైర్మన్ చిట్టెడి సుధాకర్ రెడ్డిని ప్రత్యేకంగా అభినందించిన షబ్బీర్ అలీ, రైతులు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని సూచించారు. రాజకీయాలకు అతీతంగా ప్రతి రైతుకు సమానంగా సేవలందిస్తూ ప్యాక్స్‌ను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు నూతన పాలకవర్గం సమష్టిగా కృషి చేయాలని ఆకాంక్షించారు. అంతంపల్లి, లక్ష్మీదేవునిపల్లి తదితర గ్రామాల రైతుల సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు తనవంతు సహకారం అందిస్తానని షబ్బీర్ అలీ హామీ ఇచ్చారు. కామారెడ్డి నియోజకవర్గంలో గ్రామీణ మౌలిక వసతులు, రహదారులు, తాగునీరు, విద్య, వైద్యం, వ్యవసాయం తదితర రంగాలకు ప్రాధాన్యతనిస్తూ అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళుతున్నామని తెలిపారు. ప్రజా సంక్షేమంతో పాటు గ్రామీణాభివృద్ధికి పెద్దపీట వేస్తూ అభివృద్ధి ఫలాలు ప్రతి గ్రామానికి చేరేలా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బద్దం ఇంద్రకరణ్ రెడ్డి, మాజీ డీసీసీ అధ్యక్షులు కైలాస్ శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు నరేందర్ రెడ్డి, అంతంపల్లి సర్పంచ్ మంజుల సంజీవరెడ్డి, లింగారెడ్డి, బిక్కనూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ రాజు, తిప్పాపూర్ సొసైటీ చైర్మన్ భీంరెడ్డి, కామారెడ్డి సొసైటీ చైర్మన్ గూడెం శ్రీనివాస్ రెడ్డి, చుక్కాపూర్ లక్ష్మీనర్సింహ ఆలయ చైర్మన్ కమలాకర్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు గోనె శ్రీనివాస్, సుదర్శన్, కౌన్సిలర్ మోతిలాల్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు భూమని బాలరాజ్, తాటిపాముల లింబాద్రి, డీసీసీ ఉపాధ్యక్షులు గంప ప్రసాద్, ప్రవీణ్ రెడ్డి, శ్రీకాంత్, యాదవ రెడ్డి, కామారెడ్డి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు సందీప్ తదితర నాయకులు, కార్యకర్తలు, మహిళలు, రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు. అనంతరం స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం కూడా నిర్వహించి, అర్హులైన లబ్ధిదారులకు కార్డులను అందజేశారు.

# రీ-సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలి

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్





**పోరు తెలంగాణ, మంచిర్యాల,ఆగస్టు 27, 2026:** జిల్లాలో భూ రీ-సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ విలాయత్ అలీ, సర్వే ల్యాండ్ రికార్డ్ ఎ.డి. శ్రీనివాస్ లతో కలిసి లైసెన్స్‌డ్ సర్వేయర్లకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రీ-సర్వేలో భాగంగా లైసెన్స్‌డ్ సర్వేయర్లతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, జిల్లాలోని ప్రభుత్వ భూములు, అటవీ భూములు, గ్రామాల హద్దులు తదితర ప్రాంతాలను సమగ్రంగా సర్వే చేయాలని తెలిపారు. ప్రతి బృందం లక్ష్యానికి అనుగుణంగా సర్వే పనులను పూర్తి చేయాలని, ఒక బృందం రోజుకు 30 ఎకరాల వరకు సర్వే చేసే విధంగా కార్యాచరణ రూపొందించాలని తెలిపారు. సర్వే, కొ-రిలేషన్ స్టేట్‌మెంట్ తయారీతో పాటు నోటీసుల జారీ ప్రక్రియను ఏకకాలంలో చేపట్టాలని, రైతులకు నోటీసులు సకాలంలో అందజేయాలని, రీ-సర్వే ప్రక్రియపై రైతుల్లో విస్తృత అవగాహన కల్పించాలని తెలిపారు. నోటీసుల జారీలో ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. గ్రామాల హద్దుల నిర్ధారణకు సంబంధించిన సమాచారం సర్పంచులు, రైతులకు అందించాలని, గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, రీ-సర్వే ప్రక్రియలో ప్రజల సహకారం తీసుకుని పారదర్శకంగా పనులను పూర్తి చేయాలని తెలిపారు. రీ-సర్వేకు సంబంధించి ఫారాలు అందుబాటులో ఉన్నాయని, నిబంధనల ప్రకారం సక్రమంగా పూర్తి చేసి రికార్డులను సిద్ధం చేయాలని సూచించారు. జిల్లాలో రీ-సర్వేకు పైలట్ గ్రామంగా తాండూర్ మండలంలోని రాంపూర్ గ్రామాన్ని ఎంపిక చేయడం జరిగిందని, గ్రామంలో సుమారు 581 ఎకరాల భూమి ఉందని తెలిపారు. ప్రతి మండలం నుంచి ఒక గ్రామాన్ని ఎంపిక చేసి, ఆ గ్రామంలో రీ-సర్వే ప్రక్రియపై అవసరమైన శిక్షణ అందించాలని సూచించారు. రీ-సర్వే పనులపై తహసిల్దార్లు ప్రత్యేక చొరవ చూపి క్షేత్రస్థాయిలో పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. జి.పి.ఓ.లు భూములకు సంబంధించిన రెవెన్యూ రికార్డులను సక్రమంగా సిద్ధం చేసి, రీ-సర్వేకు అవసరమైన సమాచారాన్ని అందుబాటులో ఉంచాలని తెలిపారు. భూముల రిజిస్ట్రేషన్ సమయంలో తహసిల్దార్ కార్యాలయాలలో సీలింగ్ డిక్లరేషన్‌ను పరిశీలించి, నిబంధనల ప్రకారం రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేపట్టాలని సూచించారు. భూభారతి దరఖాస్తులలో భూమి విస్తీర్ణానికి సంబంధించిన వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి, రికార్డులతో సరిపోల్చిన అనంతరం తదుపరి చర్యలు చేపట్టాలని తెలిపారు. ఎస్.ఐ.ఆర్. నోటీసుల జారీ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని, జిల్లాలో ఎస్.ఐ.ఆర్. ప్రక్రియలో బూత్ స్థాయి అధికారులు తమ విధులను సక్రమంగా నిర్వహించేలా సంబంధిత అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. రీ-సర్వే, ఎస్.ఐ.ఆర్., రెవెన్యూ రికార్డుల నవీకరణ ప్రక్రియలు సమన్వయంతో కొనసాగిస్తూ నిర్ణీత లక్ష్యాలను చేరుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ భూములు, అటవీ భూములు సహా జిల్లాలోని అన్ని భూముల వివరాలను క్షేత్రస్థాయిలో ఖచ్చితంగా సర్వే చేసి, రికార్డులను నవీకరించాలని సూచించారు. రోజువారీ లక్ష్యాలను నిర్దేశించుకుని, ప్రతి రోజు సాధించిన పురోగతిని సమీక్షిస్తూ రీ-సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్






**పోరు తెలంగాణ, మంచిర్యాల,ఆగస్టు 27, 2026:** కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాలలో చేపట్టిన అభివృద్ధి పనులు వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని మందమర్రి మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి కొనసాగుతున్న అదనపు గదుల నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని ప్రభుత్వ విద్యా సంస్థలలో విద్యార్థులకు సకల సదుపాయాలు కల్పించి నాణ్యమైన విద్య అందించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, ఈ క్రమంలో అదనపు గదుల నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని తెలిపారు. విద్యాలయంలోని వంటశాల, భోజనశాలలను పరిశీలించి విద్యార్థులకు అందిస్తున్న భోజనం నాణ్యత, పరిశుభ్రత, వంటశాలలో పాటిస్తున్న పారిశుద్ధ్య ప్రమాణాలను పరిశీలించి, విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన ఆహారం అందేలా చర్యలు తీసుకోవాలని, విద్యార్థుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని తెలిపారు. విద్యార్థులతో మాట్లాడి విద్యాలయంలో అందుతున్న విద్యా బోధన, వసతులు, మధ్యాహ్న భోజన నాణ్యత, త్రాగునీరు, పారిశుద్ధ్యం, ఇతర సౌకర్యాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని, విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపరిచేలా ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఆత్మీయుల మధ్య హరిహర ప్రసాద్--సుమనశ్రీ వివాహ వేడుక



**పోరు తెలంగాణ నెక్కొండ ఆగస్టు 27:** ఈరోజు వరంగల్ జిల్లా నెక్కొండ మండల సీనియర్ జర్నలిస్ట్ దేసూ లక్ష్మణ్, శోభారాణి దంపతుల కుమారుడు దేసూ హరిహర ప్రసాద్, సుమనశ్రీల వివాహ మహోత్సవం ఖమ్మం జిల్లా కేంద్రంలో బుధవారం వైభవంగా జరిగింది. ఆత్మీయులు, బంధుమిత్రులు, పాత్రికేయులు, రాజకీయ ప్రముఖుల సమక్షంలో జరిగిన ఈ వేడుక సందడిగా సాగింది. వివాహానికి హాజరైన నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి నూతన వధూవరులను ఆశీర్వదించి, వారి దాంపత్య జీవితం ఆనందమయంగా సాగాలని ఆకాంక్షించారు. మాజీ ఎంపీపీ ఘటిక అజయ్‌కుమార్ సైతం నూతన జంటను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నెక్కొండ--రెడ్లవాడ పీఏసీఎస్ చైర్మన్లు చల్ల శ్రీపాల్‌రెడ్డి, ఆవుల శ్రీనివాస్, వరంగల్ జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి బక్కి అశోక్, టీపీసీసీ సభ్యులు, జర్నలిస్టులు పూర్ణచందర్, సురేష్, సుధాకర్ తదితరులు హాజరై హరిహర ప్రసాద్--సుమనశ్రీ దంపతులకు శుభాకాంక్షలు అందజేశారు. దేసూ లక్ష్మణ్ కుటుంబ సభ్యులతో పాటు పలువురు పాత్రికేయులు, శ్రేయోభిలాషులు, తాటిపల్లి శివకుమార్, బొల్లె బోయిన వీరస్వామి, మూసిన మాధవ్ , పలు గ్రామాల ప్రస్తుత సర్పంచులు, మాజీ సర్పంచ్లు, ఎంపీటీసీ,లు వివాహ వేడుకలో పాల్గొని నూతన దంపతులను ఆశీర్వదించారు.

# ఏఐటియుసి పోస్టర్ ఆవిష్కరణ




**పోరు తెలంగాణ, ఖమ్మం జిల్లా బ్యూరో నాగకృష్ణ, ఆగస్టు 27:** ఏఐటియుసి రాష్ట్ర మహాసభల పోస్టర్ను గురువారం స్థానిక గిరిప్రసాద్ భవన్లో ఏఐటియుసి నాయకులు విడుదల చేశారు. ఏఐటియుసి రాష్ట్ర మహాసభలు సెప్టెంబరు 6, 7, 8 తేదీల్లో కరీంనగర్లో జరగనున్నాయి. మహాసభలకు -సంబంధించిన పోస్టర్ అనంతరం ఏఐటియుసి రాష్ట్ర కార్యదర్శి శింగు నర్సింహారావు మాట్లాడుతూ కార్మిక హక్కుల కోసం వందేళ్లుగా సమరశీల పోరాటాలు నిర్వహించిన చరిత్ర ఏఐటియుసికి ఉందన్నారు. స్వాతంత్ర్యానికి పూర్వం, స్వాతంత్ర్య అనంతరం అనేక ఉద్యమాలకు ఏఐటియుసి నేతృత్వం వహించి అనేక హక్కులను సాధించిందన్నారు. మారిన పరిస్థితుల్లో హక్కుల పునరుద్దరణ, కనీస వేతనాల చట్టం అమలు, ఉద్యోగ భద్రత, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్లపై మహాసభలో చర్చించి పోరాట కార్యాచరణ రూపొందించుకోనున్నట్లు నర్సింహారావు తెలిపారు. పోస్టర్ విడుదల కార్యక్రమంలో ఏఐటియుసి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బిజి క్లెమెంట్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రావి శివరామకృష్ణ, తోట రామాంజనేయులు, కార్యనిర్వాహక -అధ్యక్షులు గాదె లక్ష్మి నారాయణ, కోశాధికారి ఏనుగు గాంధీ, ఏఐటియుసి నాయకులు సిహెచ్ సీతామహాలక్ష్మి, పగడాల మల్లేష్, నిమ్మటూరి రామకృష్ణ, పేరబోయిన మోహన్రావు, కార్యదర్శులు రమేష్, శ్రీను, బోడా వీరన్న, వీరునాయక్ తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలకు నీటి సౌకర్యం కోసం పైప్ లైన్ వేయించిన ఉపాధ్యాయులు



**పోరు తెలంగాణ మంచిర్యాల ఆగస్టు 27:** భీమారం మండల కేంద్రంలోని ఆర్కేపల్లి ఎంపీపీ ఎస్ పాఠశాలలో నీటి సౌకర్యం కోసం ప్రధానోపాధ్యాయురాలు దరిపెల్లి స్వరూప, ఉపాధ్యాయులు రంగు రవీంద్ర చారి ప్రభుత్వ బోరు నుండి పాఠశాల వరకు పైపులైను వేయించారు. పిల్లల త్రాగునీటి సౌకర్యం కోసం పదివేల రూపాయల గల పైపును బోరు నుంచి పాఠశాలకు వేయించడం వల్ల పిల్లల దాహార్తిని కొంతవరకు తీర్చడం జరుగుతుంది అని అన్నారు. గ్రామస్తులు ఉపాధ్యాయుల కృషిని అభినందిస్తూ సంతోషం వ్యక్త పరిచారు

# వేంపల్లి గ్రామంలోని ఎంపీపీఎస్ పాఠశాలలో కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభం



**పోరు తెలంగాణ ప్రతినిధి (భూమేశ్వర్):** ముప్కాల్ మండలంలోని వేంపల్లి ఎంపీపీఎస్ పాఠశాలలో ఐసిటీ కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుడు శ్రీనివాస్ మాట్లాడుతూ.. పిల్లలకు కంప్యూటర్ పరిజ్ఞానం అందించేందుకు ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశం పట్ల ప్రత్యేక హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం, పాఠశాల కమిటీ వైస్ చైర్మన్ సందీప్, సభ్యులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# చేయూత పెన్షన్ దరఖాస్తు సమాచారం అందరికీ చేరాలి

## కలెక్టర్ హరిత....




**పోరు తెలంగాణ ఆగస్టు 27:** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి.: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా చేయూత పెన్షన్లను మంజూరు చేయనున్న నేపథ్యంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ సమాచారం చేరేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం.డేవిడ్, జిల్లా రెవెన్యూ అధికారి దాసరి వేణుతో కలిసి గోడ ప్రతులను ఆవిష్కరించారు. నూతన పెన్షన్ల దరఖాస్తుకు ఈ నెల 31వ తేదీ చివరి గడువు కావడంతో మారుమూల గ్రామాల ప్రజలకు సైతం సమాచారం చేరేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి దత్తారావు, కలెక్టరేట్ పర్యవేక్షకులు శశిధర్, ఏపీఓ (పెన్షన్) రామకృష్ణ, ఏపీఓ ధన్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

# మహాధర్నా కార్యక్రమంలో మద్దతు తెలిపిన ఓదెల మాజీ జెడ్పిటిసి గంట రాములు యాదవ్





**పోరు తెలంగాణ ఓదెల ప్రతినిధి రవీంద్ర చారి పెద్దపల్లి జిల్లా ఆగస్టు 27 గురువారం:** కలెక్టరేట్ కార్యాలయం వద్ద ఉద్యోగుల సమస్యల మీద జేఏసీ ఎల్, టీఎన్జీవోల చేపట్టిన మహాధర్నా కార్యక్రమం లో ఉద్యోగులకు సంఘీభావంగా మద్దతు తెలిపిన ఓదెల మాజీ జెడ్పిటిసి బీఆర్ఎస్ నాయకులు గంట రాములు యాదవ్. పి ఆర్ సి ని వెంటనే అమలు చేయాలి, పెండింగ్ లో ఉన్న 6 డిఎలను వెంటనే విడుదల చేయాలి., సిపిఎస్ ను రద్దు చేసి ఓ పి ఎస్ ను పునరుద్ధరించాలి, హెల్త్ కార్డుల పథకాన్ని సమర్ధవంతంగా అమలు చేయాలి. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలి. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు కార్మికులకు సంబంధించిన ఇతర పెండింగ్ సమస్యలను పరిష్కరించాలి అంటూ చేపట్టిన మహాధర్నా కార్యక్రమంలో జేఏసీ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## బాల్కొండ మండలంలోని

# కేజీబీవీ పాఠశాల ఆకస్మిక తనిఖీ



**పోరు తెలంగాణ ప్రతినిధి (భూమేశ్వర్):** బాల్కొండ మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలను బాల్కొండ తహసీల్దార్ ఆర్. శ్రీనివాస్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాస్టల్ పరిసరాలు, వంటగది, డైనింగ్ హాల్ ,స్టోర్ రూమ్ లను పరిశీలించారు. విద్యార్థులకు ప్రభుత్వం సూచించిన మెనూ ప్రకారం పౌష్టికాహారం, నాణ్యమైన భోజనం అందించాలని సిబ్బందికి సూచించారు. తాగునీటిపై ప్రతేక శ్రద్ధ వహించాలని,పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. విద్యార్థుల ఆరోగ్యంపై ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. విద్యార్థుల చదువు పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం తరగతి గదులను సందర్శించి విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను,విద్యా బోధనల పై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల వైస్ ప్రిన్సిపాల్, వార్డెన్, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

# జలాల్పూర్ గ్రామంలో గ్రామ సభ నిర్వహణ



**పోరు తెలంగాణ ప్రతినిధి (భూమేశ్వర్):** బాల్కొండ మండలంలోని జలాల్పూర్ గ్రామంలో గ్రామసభ నిర్వహించారు. సర్పంచ్ గుండేటి మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఓటరు జాబితాలో 233 పేర్లు తప్పులను సరి చేయడం,అందులో సూచించిన 9 రకాల ఐడెంటి కార్డులలో ఒక కార్డును సోమవారం తహసిల్దార్ కి అందించాలని సర్పంచ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ భోజన్న,జిపిఓ శేఖర్, కరోబార్ వేణుగోపాల్, ఫీల్డ్ అసిస్టెంట్ అనిల్,బీఎల్ఎ శ్రీనివాస్,వార్డు సభ్యులు సాగర్,పాల్గొన్నారు.

# సావెల్ గ్రామంలో ప్రత్యేక గ్రామ సభ

## ముఖ్య అతిథిగా పాల్గొన్న బాల్కొండ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్



**పోరు తెలంగాణ ప్రతినిధి (భూమేశ్వర్):** మెండోర మండలంలోని సావెల్ గ్రామంలో సర్ పై ప్రత్యేక సమగ్ర సర్వేలో భాగంగా గ్రామ సభ నిరసించారు. బాల్కొండ కాంగ్రెస్ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సర్ ఫేస్ 2 పై చర్చించి,ఓటు భద్రత ను కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కంచు శ్యామల ముత్యం, ఉప సర్పంచ్ రాజ్ కుమార్,వార్డ్ సభ్యులు,జీపీఓ సాయన్న, కార్యదర్శి రవి,బీఎల్ఓ లు,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# మహేశ్వరంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి.



**మహేశ్వరం, ఆగస్టు 27, పోరు తెలంగాణ న్యూస్ ప్రతినిధి**: మహేశ్వరంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన గురువారం మహేశ్వరం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. మహేశ్వరం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహేశ్వరం ఎక్స్‌రోడ్ వద్ద కల్లు కాంపౌండ్ యజమాని పల్లె రాజు కాంపౌండ్ తెరవడానికి వచ్చాడు. అదే సమయంలో పక్కనే నివసించే స్వర్గంటి బిక్షమమ్మ తమ ఇంటి ముందు అరుగుపై గణేష్ (40) పడుకుని ఉన్నాడని తెలిసి ఎంత పిలిచినా పలకలేదని అన్నారు. రాజు అక్కడికి వెళ్లి గణేష్‌ను పరిశీలించగా ఎలాంటి స్పందన లేకపోవడంతో కదిలించి చూడగా అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు.మృతుడు గణేష్‌కు తల్లిదండ్రులు ఎవరూ లేరని, గత కొంతకాలంగా మానసిక స్థితి సరిగా లేక మహేశ్వరంలో భిక్షాటన చేస్తూ రోడ్లపైనే నిద్రిస్తూ ఉండేవాడని స్థానికులు తెలిపారు. అనారోగ్యంతో ఆరోగ్యం క్షీణించిన నేపథ్యంలో సహజ మరణం చెంది ఉండవచ్చని పోలీసులకు తెలిపారు. గణేష్ వివరాలు తెలిసినవారు మహేశ్వరం పోలీస్ స్టేషన్ లో సంప్రదించాలని తెలిపారు. ఈ ఘటనపై మహేశ్వరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మిగతా వివరాలకు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: 8712662684, 8712579935..

## అక్రమ మద్యం రవాణా గుట్టురట్టు... సినిమా తరహా రవాణా.






**పోరు తెలంగాణ ప్రతినిధి// మెట్ పల్లి** జగిత్యాల జిల్లా కథలాపూర్ మండలంలో అక్రమ మద్యం రవాణా గుట్టు రట్టు చేసిన మెట్పల్లి ఎక్సైజ్ పోలీసులు. సినిమా తరహాలో ప్రత్యేక వాహనాన్ని తయారుచేసి కేంద్ర పాలిత ప్రాంతాలైన దాద్రా నగర్ హవేలీ,దయు దామన్ నుండి అక్రమ మద్యాన్ని సరఫరా చేస్తున్న ముఠాను అరెస్ట్ చేశారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ... ఆగస్టు 14 న కథలాపూర్ మండలంలోని గంభీర్ పూర్ గ్రామ సమీపంలో ఎక్సైజ్ పోలీసులు తనిఖీలు నిర్వహించగా అనుమానాస్పద మద్యం 13 కాటన్ లు పట్టుబడ్డాయన్నారు.ఈమద్యం ఇతర రాష్ట్రాల నుండి వస్తున్నట్లుగా గుర్తించి జిల్లా ఎక్సైజ్ అధికారుల సమన్వయంతో మెట్పల్లి ఎక్సైజ్ కార్యాలయం సిఐ వినోద్ రాథోడ్ ప్రత్యేక బృందంగా ఏర్పడి తాండ్రియాల గ్రామ శివారులో అక్రమ మద్యం తరలిస్తున్న వాహనాన్ని గుర్తించి అందులో తరలిస్తున్న 70 కాటన్ లు పట్టుకోగా తెలంగాణలో వాటి విలువ 6లక్షల రూపాయల పైచిలుకు ఉన్నదని అన్నారు.మద్యాన్ని సీజ్ చేసి మహారాష్ట్రకు చెందిన ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు తెలిపారు.

# జీవో 90ను ఉపసంహరించుకోవాలి.

బిజెపి జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్



**పోరు తెలంగాణ, మంచిర్యాల, ఆగస్టు 27.** పాలిటెక్నిక్ విద్యార్థులకు సంబంధించిన జీవో నంబర్ 90ను ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని మంచిర్యాల జిల్లా బీజేపీ అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్ డిమాండ్ చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలపై పోరాడుతున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావును హౌస్ అరెస్టు చేయడం సిగ్గుచేటన్నారు. జీవో ఉపసంహరణ, పెండింగ్ రీయింబర్స్మెంట్ విడుదల చేసే వరకు బీజేపీ పోరాటం కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## చర్ల జాబ్ మేళాకు ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావుకు ఘన స్వాగతం..

– టాటా ఇనిస్టిట్యూట్, లయన్స్ క్లబ్, కి కృతజ్ఞతలు తెలిపిన విజయ్ నాయుడు




**చర్ల, ఆగస్టు 27పోరు తెలంగాణ జిల్లా ప్రతినిధి :** కూరపాటి దాసు చర్ల మండల కేంద్రంలో జూనియర్ కళాశాల లో నిర్వహించిన జాబ్ మేళాకు విచ్చేసిన భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావుకు చర్ల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు విజయ్ నాయుడు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా విజయ్ నాయుడు మాట్లాడుతూ.. స్థానిక యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో నిర్వహిస్తున్న జాబ్ మేళా ఎంతో ఉపయోగకరమని అన్నారు. వివిధ సంస్థలు, కంపెనీలు జాబ్ మేళాలో పాల్గొని అర్హత కలిగిన యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేలా చర్యలు చేపట్టడం అభినందనీయమన్నారు. చర్ల మండలం లో పలు గ్రామాలనుండి నుంచి పెద్ద సంఖ్యలో యువత జాబ్ మేళాకు హాజరై తమ విద్యార్హతలకు అనుగుణంగా ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని విజయ్ నాయుడు సూచించారు. యువతకు ఉపాధి కల్పించేందుకు జాబ్ మేళా నిర్వహిస్తున్న టాటా ఇనిస్టిట్యూట్, లయన్స్ క్లబ్ చేస్తున్న కృషికి కాంగ్రెస్ పార్టీ తరపున పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువత, వివిధ శాఖల ప్రతినిధులు పాల్గొన్నారు.


# ముదిగొండ పోలీస్ స్టేషన్‌ను సందర్శించి తనిఖీ చేసిన పోలీస్ కమిషనర్




**పోరు తెలంగాణ ఖమ్మం జిల్లా బ్యూరో నాగకృష్ణ , ఆగస్టు 27:** ముదిగొండ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించిన పోలీస్ కమిషనర్ సునీల్ దత్ పోలీస్ స్టేషన్ నిర్వహణ, స్టేషన్‌లోని రికార్డులు, పెండింగ్ కేసుల వివరాలు, కేసుల దర్యాప్తు పురోగతిని పరిశీలించారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను, సిబ్బంది పనితీరును పరిశీలించిన కమిషనర్, ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించాలని అధికారులకు సూచించారు. పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేసి, నేర నియంత్రణకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. స్టేషన్‌కు వచ్చే బాధితులు, ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ, వారి సమస్యలను సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ప్రజల భద్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని పోలీస్ కమిషనర్ ఆదేశించారు. ఈ సందర్భంగా సెక్టర్ అధికారులు, పోలీస్ సిబ్బందితో మాట్లాడారు. కార్యక్రమంలో ఖమ్మం రూరల్ ఏసీపీ తిరుపతి రెడ్డి, సిఐ మురళి పాల్గొన్నారు.

## ఓదెల మండల స్థాయి ప్రధానోపాధ్యాయుల రివ్యూ మీటింగ్.



**పోరు తెలంగాణ ఓదెల ప్రతినిధి రవీంద్ర చారి :** ఓదెల మండల పరిధిలోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో ఎంఈఓ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో తొలిమెట్టు/ఎఫ్. ఎల్. ఎన్. , ఎల్.ఐ.పి. ల పైన చర్చించారు. అదేవిధంగా పాఠశాలలకు సంబంధించిన యు డైస్ , అపార్, ఎఫ్ ఆర్ ఎస్ అటెండెన్స్ సకాలంలో వేయాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు పాఠశాల వారీగా పురోగతిని అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా పాఠశాలలకు పంపిణీ చేసిన షూస్ , నోట్ బుక్స్ టెక్స్ట్, బుక్స్ వర్క్ బుక్స్, సంబంధించిన వివరాలు చర్చించారు అదేవిధంగా ప్రశస్త ఆప్, దీక్ష పోర్టల్ నశా ముక్త్ భారత్, బేస్ లైన్ టెస్ట్ వివరాలు ఎకో క్లబ్ యాక్టివిటీ మొదలగునవి చర్చించారు ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి రమేష్ తో పాటు కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు వివిధ పాఠశాలల ప్రధాన ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు, సిఆర్పిలు, ఎంఆర్సి సిబ్బంది పాల్గొన్నారు.

# టీజీఈ జేఏసీ మంచిర్యాల జిల్లా కమిటి ఆధ్వర్యంలో మహా ధర్నా.






**పోరు తెలంగాణ మంచిర్యాల జిల్లా, ఆగస్టు 27.** :తెలంగాణ ఉద్యోగ ఉపాధ్యాయ కార్మిక మరియు పెన్షనర్ల జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర చైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాస్ రావు, రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు టీజీఈ జేఏసీ మంచిర్యాల జిల్లా చైర్మన్ గడియారం శ్రీహరి, సెక్రటరీ జనరల్ వనజా రెడ్డి ఆధ్వర్యంలో అన్ని ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల అసోసియేషన్లు మరియు ఆఫీస్ సబార్డినేట్ నుంచి జిల్లా స్థాయి అధికారి వరకు ప్రతి ఒక్క ఉద్యోగి ఆధ్వర్యం లో నస్పూర్ లోని ఐ డి ఓ సి వద్ద మహాధర్నా నిర్వహించారు.ఈ మహా ధర్నాలో ఐ డి ఓ సి ముఖద్వారం నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టి కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. తమ సమస్యలను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ కి వినతి పత్రం సమర్పించారు. ఈ మహాధర్నా లో టీజీఈ జేఏసీ మంచిర్యాల జిల్లా చైర్మన్ గడియారం శ్రీహరి మాట్లాడుతూ సుదీర్ఘకాలంగా ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు, పెండింగ్‌లో ఉన్న ఆర్థిక ప్రయోజనాలు మరియు ప్రభుత్వం పరిష్కరించాల్సిన ప్రధాన డిమాండ్లపై సుదీర్ఘంగా చర్చించారు. ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం సంఘాలన్నీ ఐక్యంగా కృషి చేయాలని తెలిపారు ప్రధానంగా తమ డిమాండ్ల పై చర్చిస్తూ మహా ధర్నాలో అందరు ఆమోదయోగ్యంతో ఏకగ్రీవ ఆమోదం తెలుపుతూ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయించారు, 2వ పిఆర్సి ని తక్షణమే అమలు చేయాలి అని,ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న 6 విడతల డి ఎ లను వెంటనే విడుదల చేయాలి అని, ఉద్యోగులు, పెన్షనర్లకు సంబంధించిన ఈ హెచ్ ఎస్ (ఎంప్లాయిస్ హెల్త్ స్కీం )ను సమర్థవంతంగా మరియు తక్షణమే అమలు చేయాలి అని, పెండింగ్‌లో ఉన్న అన్ని బిల్లులను క్లియర్ చేయడానికి ప్రతి నెల రూ.2,000 కోట్లను విడుదల చేసి, ఉద్యోగుల బకాయిలను త్వరితగతిన చెల్లించాలి అని,ఉద్యోగుల సీపీఎస్ (కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ) సమస్యను పరిష్కరించి, ఉద్యోగులకు న్యాయం చేయాలి అని, రాష్ట్రంలోని ఉద్యోగ సంఘాలు, అసోసియేషన్లకు తగిన గుర్తింపు (రికగ్నిషన్ ) కల్పించి, వాటి సమస్యలను అధికారికంగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలి అని డిమాండ్ చేశారు. తమ న్యాయమైన డిమాండ్లు ఉద్యోగుల ఆర్థిక, సామాజిక మరియు సేవా ప్రయోజనాలకు సంబంధించిన సమస్యలను తెలంగాణ ప్రభుత్వము తక్షణమే స్పందించి , వెంటనే చర్చలకు పిలిచి ఉద్యోగ, ఉపాధ్యాయ , కార్మిక మరియు పెన్షనర్ల సమస్యలు తక్షణ పరిష్కారం చూపాలని టీజీఈ జేఏసీ మంచిర్యాల జిల్లా చైర్మన్ గడియారం శ్రీహరి తెలిపారు. టీజీఈ జేఏసీ మంచిర్యాల జిల్లా సెక్రటరీ జనరల్ వనజా రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగ ఉపాధ్యాయ కార్మిక మరియు పెన్షనర్ల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే చర్చలు జరిపి సమస్యలు పరిష్కరించాలని లేనిచో భవిష్యత్ కార్యాచరణ ప్రకటించి ఉద్యమం తీవ్రతరం చేస్తామని హెచ్చరించడం జరిగినది. ఈ మహా ధర్నాలో అదనపు సెక్రటరీ జనరల్. కె. శంకర్ కో-చైర్మన్లులి జి. చక్రపాణి, శ్రీనివాస్ దేశ్‌పాండే, పొన్న మల్లయ్య, శ్రీపతి బాపురావు, బట్టారి వెంకటేశ్వర్లు, గుండేటి నాందేవ్, సుమిత్ పోడేటి సంజీవ్,పొలాస సత్యనారాయణ, ధరణి కోట వేణుగోపాల్, పత్తి సత్తయ్య, బి. ప్రభాకర్,దుర్గ ప్రసాద్,బి. రామ్ మోహన్, కె.వి.ఎల్.ఎన్. మూర్తి రాజేశ్వర్, ఎం.డి. అజర్, రాసపల్లి రవి, జి. రాజగోపాల్ డిప్యూటీ సెక్రటరీ జనరల్ బొడ్డు శ్రావణ్ కుమార్, ఎ.సుధాకర్ వైస్ చైర్మన్లు బి. మోహన్, జి. రాజవేణు, ఓ. కృష్ణ, బి. మనోజ్, మోతె జయకృష్ణ, సూరినేని గంగాధర్, బన్న రవీందర్, ఎస్. కిషన్, బాలకృష్ణ, ఎ. సునీత, ఎన్. గోపాల్, బెజ్జంకి జగన్, ఏ రాజేందర్ రెడ్డి, మోషిన్ అహ్మద్ ,వెంకటరమణ, ఎం. రమేష్ ,రాథోడ్ రమేష్ ఫైనాన్స్ సెక్రటరీ అనుముల సతీష్ కుమార్ పబ్లిసిటీ సెక్రటరీ జె. రామ్ కుమార్ సెక్రటరీ లు నడిమెట్ల సత్యనారాయణ, తిరుపతి,మేడి శంకర్, గుండు వెంకటేశం,జి. వెంకటస్వామి, కే. శ్రీధర్ స్వామి మరియు టీజీవో,టీఎన్జీఓ, నాయకులు, వివిధ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల మరియు కార్మిక సంఘాల ప్రతినిధులు నాయకులు మరియు జిల్లా లోని అన్ని శాఖల ఉద్యోగులు సుమారు 4500 మంది పాల్గొన్నారు.

# ఖమ్మంలో బీజేపీ ఫైర్.!

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై కదం తొక్కిన కమలదళం.

ఉద్రిక్తంగా మారిన జెడ్పీ సెంటర్ ఆందోళన.

పోలీసుల ఈడ్చివేత, నెల్లూరి కోటేశ్వరరావు సహా నేతల అరెస్ట్.

విద్యార్థుల భవిష్యత్తుతో సర్కారు చెలగాటం.

నిధులు ఇవ్వకుంటే మంత్రులను రోడ్లపైనే అడ్డుకుంటాం.

బిజెపి జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు.



**పోరు తెలంగాణ,ఖమ్మం జిల్లా బ్యూరో నాగకృష్ణ, ఆగస్టు 27.** రాష్ట్రవ్యాప్తంగా విద్యాసంస్థలకు ప్రభుత్వం చెల్లించాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఖమ్మం నగరంలో భారతీయ జనతా పార్టీ చేపట్టిన ఆందోళన తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది. బీజేపీ జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో గురువారం జెడ్పీ సెంటర్ వద్ద పార్టీ శ్రేణులు కదం తొక్కాయి. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న నాయకులను పోలీసులు అడ్డుకోవడంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం పెరిగి తోపులాటకు దారితీసింది. పరిస్థితి అదుపుతప్పడంతో రోడ్డుపై బైఠాయించిన నాయకులను పోలీసులు బలవంతంగా ఈడ్చుకువెళ్లి అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించడంతో ఖమ్మం జెడ్పీ సెంటర్ రణరంగాన్ని తలపించింది. విద్యార్థుల పక్షాన అలుపెరగని పోరాటం చేస్తున్న బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలతో హోరెత్తించారు. వద్దురా నాయనా కాంగ్రెస్ పాలన, దొంగల రాజ్యం.. దోపిడీ రాజ్యం అంటూ ప్రభుత్వ తీరును ఎండగట్టారు. ఈ సందర్భంగా పోలీసుల వలయాన్ని ఛేదించుకుని ముందుకు వెళ్లేందుకు యత్నించిన ఆందోళనకారులను బలవంతంగా అదుపులోకి తీసుకుని పోలీస్ వాహనాల్లో ఎక్కించారు. ఈ అరెస్టుల పర్వంతో ఖమ్మం నగరంలో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీరుపై తీవ్రస్థాయిలో నిప్పులు చెరిగారు. పేద, మధ్యతరగతి విద్యార్థుల ఉన్నత చదువుల ఆకాంక్షను రాష్ట్ర ప్రభుత్వం దారుణంగా నీరుగారుస్తోందని ఆయన మండిపడ్డారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల సాధన కోసం బీజేపీ గత నెల రోజులుగా అలుపెరగని పోరాటం చేస్తోందని గుర్తుచేశారు. బకాయిలు పేరుకుపోవడంతో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 40 లక్షల కుటుంబాలు తీవ్ర మనోవేదనకు గురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గత ఎనిమిదేళ్లుగా కళాశాలలకు కనీస నిర్వహణ నిధులు అందక, విద్యాసంస్థలు తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నాయని స్పష్టం చేశారు. ఫీజులు చెల్లించనిదే విద్యార్థులకు యాజమాన్యాలు ఒరిజినల్ సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని, దీంతో చదువు పూర్తయినా ఉద్యోగాలకు వెళ్లలేక యువత రోడ్డున పడుతోందని ఆయన ప్రభుత్వాన్ని నిలదీశారు. పాలిటెక్నిక్ కళాశాలలను సందర్శించి విద్యార్థుల సమస్యలు తెలుసుకుందామనుకున్న నాయకులను నిజాం కాలం నాటి తరహాలో గృహనిర్బంధాలు చేయడం, అక్రమంగా అరెస్టులు చేయడం ఈ ప్రభుత్వ నిరంకుశత్వానికి పరాకాష్ట అని కోటేశ్వరరావు ధ్వజమెత్తారు. పాలకులు తమ స్వలాభం కోసం రాష్ట్రాన్ని అప్పులపాలు చేస్తున్నారని, విద్యార్థుల భవిష్యత్తును గాలికి వదిలేశారని విమర్శించారు. ప్రభుత్వం తక్షణమే కళ్లు తెరిచి పెండింగ్ బకాయిలను విడుదల చేయకపోతే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు మంత్రులను సైతం రోడ్ల మీద తిరగనివ్వబోమని తీవ్రస్థాయిలో హెచ్చరించారు. పరిపాలన చేతకాకపోతే తక్షణమే ప్రభుత్వాన్ని రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. విద్యార్థి లోకం కన్నెర్రజేస్తే కాంగ్రెస్ సర్కారు ఆ యువత ఆగ్రహ జ్వాలల్లో కాలిపోక తప్పదని ఆయన స్పష్టం చేశారు. దేశంలో డబుల్ ఇంజిన్ సర్కార్ అండ ఉన్న రాష్ట్రాల్లోనే ప్రజలు సుఖసంతోషాలతో, అభివృద్ధి పథంలో పయనిస్తున్నారని, తెలంగాణలోనూ ఆ మార్పు రావాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా కోటేశ్వరరావు అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమంలో శ్యామ్ రాథోడ్, నున్న రవి కుమార్ , అల్లిక అంజయ్య, కొణతం లక్ష్మీనారాయణ, నకిరేకంటి వీరభద్రం, శ్రీరామనేని మణి , మంద సరస్వతి ,శాసనాలు సాయిరాం, పమ్మీ అనిత, ఆర్ వి ఎస్ యాదవ్, రుద్ర గాని మాధవ్ బి.కొండ శ్యామ్, శ్రీ లక్ష్మీ రెడ్డి, ఫణి కుమారి, స్వర్ణ, భద్రం , గోనెల శివ తదితరులు పాల్గొన్నారు.

# మాదక ద్రవ్యాల నియంత్రణ దిశగా అధికారులు చర్యలు చేపట్టాలి

జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్





**పోరు తెలంగాణ, మంచిర్యాల,ఆగస్టు 27, 2026:** జిల్లాలో మాదకద్రవ్యాల నియంత్రణ దిశగా అధికారులు పకడ్బందీగా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ సమావేశ మందిరంలో డిసిపి ఎ. భాస్కర్, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య, బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్ లతో కలిసి జిల్లాలో మాదకద్రవ్యాల నియంత్రణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మాదక ద్రవ్య రహిత మంచిర్యాల జిల్లా సాధనలో భాగంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో ఈ సంవత్సరం ఇప్పటి వరకు 49 కేసులు నమోదు చేయడం జరిగిందని, ఇందులో 103 మందిని గుర్తించడం జరిగిందని తెలిపారు. మాదకద్రవ్యాల వినియోగదారులను గుర్తించి కోర్టు ద్వారా 30 మందిని డ్రగ్ డి-అడిక్షన్ కేంద్రాలకు తరలించి కౌన్సిలింగ్ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. విద్యా సంస్థలలో విద్యార్థులచే యాంటీ డ్రగ్ కమిటీలను ఏర్పాటు చేయడం జరిగిందని, వారి ద్వారా ప్రతి నెల అవగాహన కార్యక్రమాలు, మాదకద్రవ్యాల నియంత్రణపై క్విజ్, డ్రాయింగ్ మొదలగు పోటీలను నిర్వహించాలని తెలిపారు. విద్యాసంస్థలకు 100 మీటర్ల పరిధిలో బెల్ట్ షాపులు నిర్వహించడం, పొగాకు సంబంధిత ఉత్పత్తులను అమ్మడం నిషేధించడం జరిగిందని, ఆ దిశగా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. మెడికల్, ఐటిఐ, ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలలో నిత్యం మాదక ద్రవ్యాల వినియోగంపై విద్యార్థులను గమనిస్తూ మాదక ద్రవ్యాల వినియోగం వలన కలిగే నష్టాలపై అవగాహన కల్పించాలని తెలిపారు. జిల్లాలోని మద్యం దుకాణాలు నిర్ణీత సమయానికి మూసివేసేలా చర్యలు తీసుకోవాలని, బెల్ట్ షాపులను నియంత్రించాలని తెలిపారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో గంజాయి తదితర మొక్కల సాగు చేసే వారిని గుర్తించాలని తెలిపారు. డ్రగ్ ఇన్స్పెక్టర్ ఆధ్వర్యంలో మెడికల్ షాప్ లను నిత్యం పర్యవేక్షించాలని, సరైన ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులను విక్రయించే షాపులపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణపై పోలీస్, రవాణా, జాతీయ రహదారులు, రోడ్లు భవనాలు, ఆర్.టి.సి., విద్యుత్, పంచాయతీ రాజ్ శాఖల అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత అధికారులతో రోడ్డు భద్రత కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణ చర్యలు పటిష్టంగా అమలు చేయాలని, వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు తప్పనిసరిగా పాటించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. మున్సిపల్ పరిధిలో రోడ్డు ప్రమాదాల నివారణకు స్పీడ్ బ్రేకర్లు, ఇతర రోడ్డు భద్రత సూచికలు ఏర్పాటు చేయాలని తెలిపారు. మున్సిపల్ పరిధిలోని రోడ్లపై చెత్త, ఆటంకాలను వెంటనే తొలగించాలని, ట్రాఫిక్ పోలీసు విభాగం రోడ్లపై అనధికార వాహన నిలుపుదల, నిబంధనల ఉల్లంఘన పట్ల కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. రోడ్లపై తక్కువ విజిబిలిటీ ఉన్న చోట్ల లైటింగ్ ఏర్పాటు చేయాలని, జాతీయ రహదారులపై రంబుల్ స్ట్రిప్స్, లైటింగ్, జాగ్రత్త సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని తెలిపారు. రవాణా శాఖ ఆధ్వర్యంలో రోడ్లపై అదుపు తప్పిన, ఓవర్ లోడెడ్ వాహనాలు, పరిమితికి మించి వేగంగా వెళ్లే వాహనాలపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని, జిల్లాలో ఈ సంవత్సరం ఇప్పటి వరకు 95 లైసెన్సులు రద్దు చేయడం జరిగిందని, ఫిట్ నెస్ లేని స్కూల్ బస్సులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ట్రాఫిక్ పోలీసు అధికారులు ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరి చేయడంలో కఠినంగా వ్యవహరించాలని తెలిపారు. మున్సిపల్ కమిషనర్లు తమ పరిధిలో రోడ్డు భద్రతకు అవసరమైన చర్యలు చేపట్టాలని, గ్రామీణ ప్రాంతాలలో, అంతర్గత రహదారులలో తగిన జాగ్రత్తలు తీసుకోవడం జరుగుతుందని, జిల్లా వ్యాప్తంగా వేగ పరిమితి బోర్డులు, హెచ్చరిక బోర్డులు, జాగ్రత్త సూచికలు ఏర్పాటు చేయాలని తెలిపారు. ఓవర్ లోడింగ్, మితిమీరిన వేగం, డ్రంక్ అండ్ డ్రైవింగ్, రాంగ్ సైడ్ డ్రైవింగ్ లపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. రోడ్లపై సంచరించే పశువులను అందుబాటులో ఉన్న గోశాలకు తరలించాలని, నూతన గోశాల ఏర్పాటుకు భూమిని కేటాయించడం జరిగిందని త్వరితగతిన పనులు చేపట్టి పూర్తి చేయాలని తెలిపారు. రహదారి ప్రమాదాలు, మరణాలు తగ్గించేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాసరావు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ విలాయత్ అలీ, మంచిర్యాల, బెల్లంపల్లి, జైపూర్ ల ఎసిపిలు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# దిలావర్ గూడ లో వ్యక్తి అదృశ్యం..



**మహేశ్వరం, ఆగస్టు 27, పోరు తెలంగాణ న్యూస్ ప్రతినిధి:** ఒక వ్యక్తి అదృశ్యమైన సంఘటన మహేశ్వరం పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం చోటుచేసుకుంది. దిలావర్‌గూడ గ్రామంలో ఆలూరి శ్రీకాంత్ (31) అనే వ్యక్తి అదృశ్యమయ్యాడు. ఈ మేరకు ఆయన బంధువు నర్రె జ్యోతి మహేశ్వరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇబ్రహీంపట్నం మండలం చర్లపటేల్‌గూడకు చెందిన ఆలూరి శ్రీకాంత్ సుమారు ఐదేళ్ల క్రితం గుమ్మడివెల్లి గ్రామానికి చెందిన మనీషాను వివాహం చేసుకున్నాడు.కొంతకాలం వారి సంసారం సజావుగా సాగినప్పటికీ గత రెండేళ్లుగా కుటుంబ కలహాలు ఏర్పడ్డాయి. పెద్దల సమక్షంలో పంచాయితీలు జరిగినప్పటికీ సమస్య పరిష్కారం కాకపోవడంతో గత ఎనిమిది నెలల క్రితం విడాకుల కోసం దరఖాస్తు చేసుకున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.ఆ తర్వాత శ్రీకాంత్ ఇంటి నుంచి వెళ్లిపోవడంతో ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదైంది. గత వారం క్రితం కడ్తాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శ్రీకాంత్‌ను గుర్తించగా, అప్పటి నుంచి దిలావర్‌గూడలోని తమ బంధువు ఇంట్లో ఉంటున్నాడు. ఈ క్రమంలో మార్చి 23న సాయంత్రం సమయంలో జ్యోతి తన కుటుంబ సభ్యులతో కలిసి బంధువుల గ్రామమైన బ్రహ్మణపల్లికి వెళ్లింది. రాత్రి గంటలకు తిరిగి ఇంటికి వచ్చేసరికి శ్రీకాంత్ కనిపించలేదు. అతని సెల్‌ఫోన్‌కు ఫోన్ చేయగా స్విచ్చాఫ్‌లో ఉన్నట్లు తెలిసింది. పరిసర ప్రాంతాలు, బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. శ్రీకాంత్ ఎత్తు సుమారు 5.5 అడుగులు, తెల్లటి ఛాయ, ఓవల్ ముఖాకృతి కలిగి ఉంటాడని తెలుగు మాట్లాడుతాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. అదృశ్యమైన సమయంలో బ్రౌన్ కలర్ షర్ట్, బ్లూ కలర్ నైట్ ప్యాంట్ ధరించి ఉన్నట్లు తెలిపారు. ఆయన ఆచూకీ తెలిసినవారు మహేశ్వరం పోలీస్ స్టేషన్ లో సంప్రదించాలని తెలిపారు.

# ఫరీద్‌పేట్‌లో మాజీ సర్పంచ్ హయంలో అక్రమాలపై పాల్వంచ కాంగ్రెస్ మండల అధ్యక్షులు గృహ నిర్మాణం పై డీఎల్పీఓ విచారణ...

పర్మిషన్ లేకుండా గృహ నిర్మాణం చేపట్టినట్లు ఫిర్యాదు ..

గ్రామపంచాయతీలో అధికారుల పరిశీలన...





**కామారెడ్డి జిల్లా ప్రతినిధి; ఆగస్టు 27 (పోరు తెలంగాణ న్యూస్)**: కామారెడ్డి జిల్లా పాల్వంచ మండలం ఫరీద్‌పేట్ గ్రామంలో గత మాజీ సర్పంచ్ ఆశశీభాగ్యమ్మ హయాంలో జరిగినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న అవినీతి, నిధుల దుర్వినియోగం, అలాగే గ్రామపంచాయతీ అనుమతులు లేకుండా చేపట్టిన గృహ నిర్మాణంపై గురువారం అధికారులు విచారణ చేపట్టారు. గత ప్రజావాణిలో అందిన ఫిర్యాదు మేరకు కామారెడ్డి డీఎల్పీఓ శ్రీనివాస్, ఎంపీఓ సురేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో గ్రామంలో పలు అంశాలను పరిశీలించారు. మాజీ సర్పంచ్ ఆశశీ భాగ్యమ్మ హయాంలో సుమారు రూ.13 లక్షల నిధుల దుర్వినియోగం జరిగినట్లు వచ్చిన ఫిర్యాదుపై అధికారులు వివరాలు సేకరించారు. సంబంధిత రికార్డులు, పత్రాలను పరిశీలించిన అనంతరం పూర్తి నివేదికను జిల్లా కలెక్టర్‌కు సమర్పిస్తామని డీఎల్పీఓ శ్రీనివాస్ తెలిపారు. ఇదిలా ఉండగా, పాల్వంచ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పల్లె రమేష్ గౌడ్ సుమారు మూడేళ్ల క్రితం నుంచి గ్రామపంచాయతీ అనుమతి లేకుండా గృహ నిర్మాణం చేపట్టినట్లు గ్రామ సర్పంచ్ జీడిపల్లి నరసింహారెడ్డి, వార్డు సభ్యురాలు దేవోల్లా ప్రత్యూష ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై అధికారులు గ్రామపంచాయతీ కార్యదర్శిని వివరణ కోరగా, సంబంధిత గృహ నిర్మాణానికి గ్రామపంచాయతీ నుంచి ఎలాంటి అనుమతి జారీ కాలేదని కార్యదర్శి లావణ్య తెలిపినట్లు అధికారులు పేర్కొన్నారు. అనుమతులు లేకుండా నిర్మించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న గృహానికి వెంటనే నిబంధనల ప్రకారం అనుమతి పొందడంతో పాటు, గత మూడు సంవత్సరాలుగా చెల్లించాల్సిన ఇంటి పన్నును గ్రామపంచాయతీలో జమ చేయించాలని సర్పంచ్ జీడిపల్లి నరసింహారెడ్డి, వార్డు సభ్యులు దేవోల్లా రాములు తదితరులు, గ్రామ ప్రజలు, యువత డిమాండ్ చేశారు. అక్రమ నిర్మాణాలపై అధికారులు నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

# నూతన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ..

పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం: ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్




**కామారెడ్డి జిల్లా ప్రతి నిధి:ఆగస్టు 27.(పోరు తెలంగాణ న్యూస్:)** కామారెడ్డి నియోజకవర్గంలోని మాచారెడ్డి మండల కేంద్రంలోని బాలాజీ ఫంక్షన్ హాల్‌లో నూతనంగా మంజూరైన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. తెలంగాణ ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ ప్రభుత్వ అధికారులతో కలిసి అర్హులైన పేద కుటుంబాలకు నూతన స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా మహమ్మద్ అలీ షబ్బీర్ మాట్లాడుతూ, పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యం. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ప్రభుత్వం" అని అన్నారు. గత ప్రభుత్వాల హయాంలో దాదాపు 15 సంవత్సరాలుగా అనేక అర్హులైన పేద కుటుంబాలకు కొత్త రేషన్ కార్డులు అందక తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయని ఆయన అన్నారు. రేషన్ కార్డు లేకపోవడంతో ప్రభుత్వ సంక్షేమ పథకాలు, నిత్యావసర సరుకుల సబ్సిడీతో పాటు ఇతర సంక్షేమ ప్రయోజనాలను పొందడంలో పేద కుటుంబాలు ఇబ్బందులు పడ్డాయని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి రేషన్ కార్డు అందించాలనే సంకల్పంతో కాంగ్రెస్ ప్రభుత్వం నూతన స్మార్ట్ రేషన్ కార్డుల జారీ ప్రక్రియను చేపట్టిందని షబ్బీర్ అలీ తెలిపారు. అర్హత ఉన్న ఏ కుటుంబం కూడా ప్రభుత్వ సంక్షేమానికి దూరం కాకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. నూతన రేషన్ కార్డు ద్వారా కుటుంబాలకు ప్రభుత్వ ప్రజా పంపిణీ వ్యవస్థ కింద సబ్సిడీపై బియ్యం వంటి నిత్యావసర సరుకులు పొందే అవకాశం కలుగుతుందని, అంతేకాకుండా రేషన్ కార్డు అనేక సంక్షేమ పథకాలకు అర్హతను నిర్ధారించే ముఖ్యమైన పత్రంగా ఉపయోగపడుతుందని తెలిపారు. పేద కుటుంబాలకు ఆహార భద్రత కల్పించడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల ప్రయోజనాలను అర్హులకు చేరవేయడంలో రేషన్ కార్డులు కీలకంగా ఉంటాయని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఒకవైపు పేదలకు సంక్షేమ పథకాలు అందిస్తూనే, మరోవైపు రాష్ట్రంలో మౌలిక వసతులు, విద్య, వైద్యం, వ్యవసాయం, ఉపాధి రంగాల్లో అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగిస్తోందని షబ్బీర్ అలీ పేర్కొన్నారు. మహాలక్ష్మి, ఉచిత బస్సు ప్రయాణం, గృహజ్యోతి ద్వారా ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, రైతు రుణమాఫీ, కళ్యాణమస్తు--షాదీ ముబారక్ వంటి సంక్షేమ కార్యక్రమాలతో అర్హులైన కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా సొంత ఇల్లు లేని పేద కుటుంబాలకు గృహ సదుపాయం కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని, మహిళలు, రైతులు, యువత, విద్యార్థులు, కార్మికులు, బలహీన వర్గాల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. కామారెడ్డి నియోజకవర్గంలో కూడా రహదారులు, తాగునీరు, విద్య, వైద్యం, వ్యవసాయం, గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నామని షబ్బీర్ అలీ తెలిపారు. ప్రభుత్వ పథకాలు కాగితాలకే పరిమితం కాకుండా చివరి అర్హుడి వరకు చేరాలి. పేద కుటుంబం ముఖంలో చిరునవ్వు తీసుకురావడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం. ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ సంక్షేమం, అభివృద్ధిని సమాంతరంగా ముందుకు తీసుకెళ్తున్నాం అని షబ్బీర్ అలీ అన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత ప్రభుత్వ అధికారులు, మాచారెడ్డి మాజీ ఎంపీపీ సురేష్ నర్సింగరావు, కామారెడ్డి మున్సిపల్ చైర్మన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బద్దం ఇంద్రకరణ్ రెడ్డి, మాజీ డీసీసీ అధ్యక్షులు కైలాస్ శ్రీనివాస్, మాచారెడ్డి సర్పంచ్ సంతోష్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు బాలరాజు, ఎస్టి సెల్ జిల్లా అధ్యక్షులు రెడ్డి నాయక్, భిక్నూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ రాజు, తిప్పపూర్ సొసైటీ చైర్మన్ భీంరెడ్డి, కామారెడ్డి సొసైటీ చైర్మన్ గూడెం శ్రీనివాస్ రెడ్డి, లక్ష్మ రెడ్డి, చుక్కపూర్ లక్ష్మి నర్సింహా ఆలయ చైర్మన్ కమలాకర్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సుదర్శన్, కౌన్సిలర్ మోతిలాల్, డీసీసీ ఉపాధ్యక్షులు గంప ప్రసాద్, కామారెడ్డి పట్టణ అధ్యక్షులు సందీప్, మాజీ సొసైటీ చైర్మన్లు పూల్ చంద్, స్వామి గౌడ్, రాజమౌళి, సత్యనారాయణ, బాలరాజు గౌడ్, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షులు రాజిరెడ్డి, నాయకులు కార్యకర్తలు, మహిళలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# మాదకద్రవ్యాల నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలి : జిల్లా అదనపు కలెక్టర్ వేణుగోపాల్



**కొత్తగూడెం ఆగస్టు 27 పోరు తెలంగాణ జిల్లా ప్రతినిధి** కూరపాటి దాసు జిల్లాలో మాదకద్రవ్యాల వినియోగం, విక్రయం, అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టేందుకు సంబంధిత శాఖలు సమన్వయంతో పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా అదనపు కలెక్టర్ వేణుగోపాల్ అధికారులను గురువారం ఆదేశించారు. ఐడిఓసీ లోని అదనపు కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా స్థాయి మాదక ద్రవ్యాల నివారణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. మాదకద్రవ్యాల వినియోగంతో వ్యక్తుల జీవితాలుదుర్భరమవుతాయని, ముఖ్యంగా యువత వీటి బారిన పడకుండా ముందస్తు అవగాహన కల్పించడం అత్యంత అవసరమన్నారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులు, యువత, కార్మికులకు విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. జిల్లాలో గంజాయి, ఇతర మాదకద్రవ్యాల అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టేందుకు పటిష్ట నిఘా వ్యవస్థ ఏర్పాటు చేయాలని తెలిపారు. కార్మికులు పనిచేసే ప్రాంతాల్లో గంజాయి సరఫరాపై ప్రత్యేక పర్యవేక్షణ ఉండాలని, మాదకద్రవ్యాల వినియోగం, విక్రయం, రవాణా వంటి చర్యలను తీవ్రంగా పరిగణించాలని అన్నారు. సంబంధిత శాఖలన్నీ ప్రణాళికబద్ధంగా సమన్వయంతో పనిచేస్తూ నిరంతర తనిఖీలు నిర్వహించాలని సూచించారు. గత సమావేశం నుండి ప్రస్తుత సమావేశం వరకు నమోదైన కేసులు, వాటి పురోగతి, మాదకద్రవ్యాల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలపై సమగ్రంగా చర్చించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రవాణా శాఖ అధికారి వెంకటరమణ,జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబూరావు,ఇల్లందు డిఎస్పీ వెంకన్న బాబు,వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మాచారెడ్డి ప్రాజూ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారం ఘనంగా నిర్వహణ

రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యం: ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ లిషబ్బీర్.




**కామారెడ్డి జిల్లా ప్రతి నిధి:ఆగస్టు 27.(పోరు తెలంగాణ న్యూస్:)** మాచారెడ్డి మండల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (ప్రాజూ) నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి తెలంగాణ ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ ముఖ్య అతిథిగా హాజరై నూతన పాలకవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నూతన ప్రాజూ చైర్మన్‌గా నౌసిలాల్ నాయక్ ప్రమాణ స్వీకారం చేయగా, నూతన పాలకవర్గ సభ్యులు కూడా ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మహమ్మద్ అలీ షబ్బీర్ మాట్లాడుతూ. రైతుల సంక్షేమమే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. రైతు బాగుంటేనే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని, రైతులకు అవసరమైన రుణాలు, విత్తనాలు, ఎరువులు, ఇతర వ్యవసాయ సేవలు సకాలంలో అందించడంలో ప్రాజూలు కీలక పాత్ర పోషించాలని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుల ప్రయోజనాలకు పెద్దపీట వేస్తూ పలు కీలక కార్యక్రమాలను అమలు చేస్తోందని షబ్బీర్ అలీ తెలిపారు రైతు భరోసా, పంట రుణమాఫీ, ఉచిత విద్యుత్, సాగునీటి వనరుల అభివృద్ధి, రైతు బీమా వంటి కార్యక్రమాలతో పాటు వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. రైతులకు మార్కెట్ సదుపాయాలు, మౌలిక వసతులు మెరుగుపరచడంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి వేగవంతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు రైతు కుటుంబం ఆర్థికంగా బలపడితేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుంది. రైతులకు అండగా నిలవడం ప్రభుత్వ బాధ్యత. ప్రాజూలు కేవలం రుణాలు అందించే సంస్థలుగా కాకుండా రైతుల సమగ్ర అభివృద్ధికి తోడ్పడే కేంద్రాలుగా పనిచేయాలి అని షబ్బీర్ అలీ సూచించారు మాచారెడ్డి ప్రాజూ నూతన చైర్మన్ నౌసిలాల్ నాయక్‌కు ప్రత్యేకంగా అభినందనలు తెలిపిన షబ్బీర్ అలీరైతులు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని, రాజకీయాలకు అతీతంగా ప్రతి రైతుకు సమానంగా సేవలు అందించాలని సూచించారు. ప్రాజూను ఆర్థికంగా బలోపేతం చేస్తూ రైతులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు నూతన పాలకవర్గం సమష్టిగా కృషి చేయాలని ఆకాంక్షించారు మాచారెడ్డి మండల రైతుల సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు తనవంతు సహకారం అందిస్తానని షబ్బీర్ అలీ హామీ ఇచ్చారు. కామారెడ్డి నియోజకవర్గంలో గ్రామీణ మౌలిక వసతులు, రహదారులు, తాగునీరు, విద్య, వైద్యం, వ్యవసాయం తదితర రంగాలకు ప్రాధాన్యతనిస్తూ అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తున్నామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమంతో పాటు విద్య, వైద్యం, ఉపాధి, గ్రామీణాభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తోందని, అభివృద్ధి ఫలాలు ప్రతి గ్రామానికి చేరేలా ప్రభుత్వం పనిచేస్తోందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో మాచారెడ్డి మాజీ ఎంపీపీ సురేష్ నర్సింగరావు, కామారెడ్డి మున్సిపల్ చైర్మన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బద్దం ఇంద్రకరణ్ రెడ్డి, మాజీ డీసీసీ అధ్యక్షులు కైలాస్ శ్రీనివాస్, మాచారెడ్డి సర్పంచ్ సంతోష్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు బాలరాజు, ఎస్టి సెల్ జిల్లా అధ్యక్షులు రెడ్డి నాయక్, భిక్నూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ రాజు, తిప్పాపూర్ సొసైటీ చైర్మన్ భీంరెడ్డి, కామారెడ్డి సొసైటీ చైర్మన్ గూడెం శ్రీనివాస్ రెడ్డి, లక్ష్మారెడ్డి, చుక్కాపూర్ లక్ష్మీనర్సింహ ఆలయ చైర్మన్ కమలాకర్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సుదర్శన్, కౌన్సిలర్ మోతిలాల్, డీసీసీ ఉపాధ్యక్షులు గంప ప్రసాద్, కామారెడ్డి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు సందీప్, మాజీ సొసైటీ చైర్మన్లు పూల్ చంద్, స్వామిగౌడ్, రాజమౌళి, సత్యనారాయణ, బాలరాజుగౌడ్, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షులు రాజిరెడ్డి తదితర నాయకులు, కార్యకర్తలు, మహిళలు, రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## మద్దికల్ లో ఓటర్ ఓటర్ డ్రాఫ్ట్ లిస్ట్ ప్రత్యేక గ్రామసభ.



**పోరు తెలంగాణ మంచిర్యాల ఆగస్టు 27.** : భీమారం మండలం మద్దికల్ గ్రామంలో గురువారం సర్పంచ్ పోతెం సమ్మయ్య ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సమావేశంలో గ్రామానికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. ఓటరు జాబితాలో ఉన్న తప్పొప్పులు, అర్హులైన వారికి ఓటరు జాబితాలో పేర్లు లేకపోవడం, పేర్లలో మార్పులు తదితర అంశాలపై ప్రజల నుంచి అభిప్రాయాలు, సమస్యలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పోతెం సమ్మయ్య, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి గణేష్, గ్రామ పెద్దలు బీఎల్ఓ (దీూ), ఆశా కార్యకర్తలు, ప్రజలు హాజరయ్యారు. గ్రామ ప్రజల సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని సమావేశంలో సూచించారు. గ్రామాభివృద్ధికి ప్రజల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని, ప్రతి ఒక్కరూ గ్రామసభల్లో పాల్గొని తమ సమస్యలను తెలియజేయాలని సర్పంచ్ కోరారు.

## రాంజీగూడ ఆశ్రమ పాఠశాలలో ఆకస్మిక తనిఖీ....

డిప్యూటీ డైరెక్టర్ జాదవ్ అంబాజీ....



**పోరు తెలంగాణ ఆగస్టు 27:** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి. : కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కెరమేరి మండలంలోని రాంజీగూడ ఆశ్రమ ఉన్నత పాఠశాలను గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ జాదవ్ అంబాజీ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. గిరిజన సంక్షేమ శాఖ ఏఈ నజీమోద్దీన్‌తో కలిసి పాఠశాల భవనం, ప్రహరీ గోడ, మరుగుదొడ్లు, తాగునీరు, పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు. విద్యార్థులకు అందుతున్న సదుపాయాలు, విద్యాభ్యాసం, వసతి, భోజనం, ఆరోగ్యంపై ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సిబ్బందిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. అధికారులు దృష్టికి తెచ్చిన సమస్యలను పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని జాదవ్ అంబాజీ తెలిపారు.మౌలిక వసతులు మెరుగుపరచడంతో పాటు విద్యా ప్రమాణాల పెంపునకు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య, మెరుగైన వసతి, పరిశుభ్రమైన వాతావరణం అందేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.

## కౌటాలలో విభయ హాస్పిటల్ ప్రారంభం

ఎమ్మెల్యే హరీష్ బాబు పాల్గొన్నారు....



**పోరు తెలంగాణ ఆగస్టు 27:** కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి.: కొమురం భీం ఆసిఫాబాద్ కౌటాల మండల కేంద్రం బస్ స్టాండ్ ఏరియాలో డా.ఎస్.శ్రీనివాస్ రావు నిర్వహణలో నూతనంగా ఏర్పాటు చేసిన విభయ హాస్పిటల్ ప్రారంభోత్సవంలో సిర్పూర్ శాసనసభ్యులు డా.పాల్వాయి హరీష్ బాబు పాల్గొన్నారు. హాస్పిటల్ యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలిపి, వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో భాజపా మండల అధ్యక్షుడు కుంచాల విజయ్, నాయకులు కుంచాల సత్యనారాయణ, వాను పటేల్, ఎల్ములే మల్లయ్య, మోతిరాం, తిరుపతి గౌడ్, బుర్ల రవి, దుబ్బుల మురళి, చౌదరి నవీన్, దుబ్బుల రావు తదితరులు పాల్గొన్నారు.

## ధర్మారంలో ఓటర్ జాబితా సమగ్ర సవరణ గ్రామసభ.




**పోరు తెలంగాణ, మంచిర్యాల, ఆగస్టు 27.** భీమారం మండలం,ధర్మారం గ్రామ పంచాయతీ లో ఓటర్ జాబితా సమగ్ర సవరణ పై సర్పంచ్ దాసరి మణి దీపక్ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఈ గ్రామసభలో ఓటర్ జాబితా సమగ్ర సవరణకు సంబంధించిన అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటర్ జాబితాలో ఉండేలా చూడడంతో పాటు, జాబితాలో ఉన్న తప్పులు, మార్పులు, చేర్పులు మరియు అభ్యంతరాలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భీమారం మండల తహసీల్దార్ సదానందం , సర్పంచ్ దాసరి మణిదీపక్ , జీపీఓ సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి శ్రవణ్ కుమార్ ఓటర్లు, ప్రజలు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, ప్రతి అర్హత కలిగిన పౌరుడి పేరు ఓటర్ జాబితాలో నమోదు కావడం, ఓటర్ జాబితా తప్పుల్లేకుండా ఉండటం ప్రజాస్వామ్య వ్యవస్థకు ఎంతో ముఖ్యమని తెలిపారు. "ప్రతి అర్హుడి ఓటు హక్కు పరిరక్షణే ప్రజాస్వామ్యానికి బలం" అని గ్రామసభలో పేర్కొన్నారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలి

జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు




**పోరు తెలంగాణ, మంచిర్యాల,ఆగస్టు 27, 2026:** జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియను పకడ్బందీగా చేపట్టి త్వరగా పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు అన్నారు. గురువారం జిల్లాలోని హాజీపూర్ మండలం కర్ణమామిడి, లక్షెట్టిపేట మండలం చందారం గ్రామపంచాయతీ కార్యాలయాలలో ఎస్ఐఆర్‌పై నిర్వహించిన గ్రామసభలలో ఆయా మండలాల తహసిల్దార్లు, అధికారులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) మాట్లాడుతూ ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా రూపొందించిన ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రజలకు అందుబాటులో ఉంచి, అందులో గుర్తించిన అనామలీస్ ఓటర్ల వివరాలను గ్రామసభలో చదివి వినిపించాలని బూత్ స్థాయి అధికారులను ఆదేశించారు. ఎ.ఎస్.డి. (గూఎంవత్, నాష్ట్రఅట్వస, ఐమ్మున) ఓటర్లకు సంబంధించి నోటీసులను నిబంధనల ప్రకారం జారీ చేసి, తదుపరి ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా, ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం ప్రతి దశను పారదర్శకంగా, నిర్ణీత గడువులో పూర్తి చేయాలని బూత్ స్థాయి అధికారులు, సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ

# బోనస్ బోగసేనా?



రైతు కంటనీరు ప్రభుత్వానికి మంచిది కాదు. అబద్ధాలతో, ఆచరణసాధ్యం కాని హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం గడిచిన ఏడాదిన్నరలో అన్ని వర్గాల ప్రజలు తనపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ముచేసింది. అనవసరపు ఆడంబరాలు, అక్కరకురాని డాంబికాలు ప్రదర్శించడం తప్ప కాంగ్రెస్ సర్కారు పనితనం ఎక్కడా కానరాలేదు. ముఖ్యంగా రాష్ట్ర రైతాంగం దుర్భర పరిస్థితులను ఎదుర్కొంటున్నది. ఎన్నికల ముందు వరంగల్ రైతుడిక్లరేషన్ పేరిట అన్నదాతలకు అనేక హామీలు గుప్పించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. నేడు వాటన్నింటికి తిలోదకాలిచ్చింది. బీఆర్ఎస్ సర్కారు సాగునీరు, రైతుబంధు, నిరంతర ఉచిత విద్యుత్తు వంటి పథకాలు అమలు చేయడంతోపాటు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి, సకాలంలో ఎరువులు, విత్తనాలు సరఫరా చేయడంతో వ్యవసాయ స్థిరీకరణ జరిగింది. తద్వారా వ్యవసాయరంగం వృద్ధి చెంది రైతుల ఆదాయం పెరిగింది. రాష్ట్ర రైతాంగం పదేండ్లపాటు సుభిక్షంగా ఉన్నది. కానీ, కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో పరిస్థితులు పూర్తిగా తారుమారయ్యాయి. రైతులకు గడ్డుకాలం వచ్చింది. ఇప్పుడు రాష్ట్రంలో ఎటుచూసినా అన్నదాతల ఆక్రందనలే వినిపిస్తున్నాయి. వరంగల్ రైతు డిక్లరేషన్ పేరిట రాహుల్‌గాంధీ సమక్షంలో అన్నదాతలపై వరాల జల్లును కాంగ్రెస్ కురిపించింది. వాటిలో ముఖ్యమైనది వడ్లకు బోనస్. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ప్రతి క్వింటా ధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తామని కాంగ్రెస్ రైతులను నమ్మించి ఓట్లు వేయించుకున్నది. తీరా అధికారంలోకి వచ్చాక సన్నరకం ధాన్యానికే ఇస్తామని కాంగ్రెస్ పాలకులు మాట మార్చేసి దగా చేశారు. ఈ యాసంగి సీజన్‌లో ధాన్యాన్ని కొనుగోలు చేసి నెల రోజులు గడుస్తున్నా, రైతులకు ఇంకా ఒక్క రూపాయి కూడా బోనస్ అందకపోవడం శోచనీయం. ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వం 18 లక్షల మెట్రిక్ టన్నులకు పైగా సన్నధాన్యం కొనుగోలు చేయగా, సుమారు రూ.1000 కోట్ల బోనస్ చెల్లించాల్సి ఉన్నది. గత సీజన్‌లో రైతులు అధిక మొత్తంలో సన్నాలు సాగు చేశారు. కానీ, గత సీజన్‌లో బోనస్ చెల్లింపులో ఆలస్యం జరగడం, చాలామంది రైతులకు బోనస్ రాకపోవడంతో ఈ సీజన్‌లో దొడ్డు వడ్ల సాగు వైపు అన్నదాతలు మొగ్గుచూపారు. బోనస్ వస్తుందనే ఆశతో సన్నాలు సాగు చేసిన అన్నదాతలకు ఇప్పుడు కూడా భంగపాటు తప్పడం లేదు. మరోవైపు రుణమాఫీ విషయంలోనూ రైతులను కాంగ్రెస్ దగా చేసింది. రుణమాఫీ కాలేదని ఎంతోమంది రైతులు ఇప్పటికీ అధికారులు, బ్యాంకుల చుట్టూ కాళ్లరిగేలా ప్రదక్షిణలు చేస్తున్నారు. రైతుబంధు పేరును రైతు భరోసాగా మార్చడంలో చూపిన ఉత్సాహాన్ని దాని అమలులో మాత్రం కాంగ్రెస్ సర్కారు చూపడం లేదు. ఎకరానికి రూ.7,500కు బదులు మాట తప్పి ఇస్తామన్న రూ.6 వేలు కూడా ఇప్పుడు అందడం లేదు. పెట్టుబడిసాయం ఎగవేయడంతో అన్నదాతలు అప్పులపాలవుతున్నారు. మరోవైపు అకాల వర్షం, వడగండ్ల వాన కారణంగా నష్టపోయిన అన్నదాతలకు నష్టపరిహారం అందడం లేదు. కొనుగోలు కేంద్రాల్లో పేరుకుపోయిన సుమారు 25 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని త్వరితగతిన కొనుగోలు చేయాలి. ఇప్పటికే కొనుగోలు చేసిన ధాన్యానికి బోనస్ ఇవ్వాలి. లేకపోతే రాబోయే రోజుల్లో లక్షలాది మంది రైతులు పోరుబాట పట్టడం ఖాయం.

## వర్షాకాలంలో బొప్పాయి పండ్లను తప్పనిసరిగా తినాల్సిందే.. ఎందుకో తెలుసా..?



బొప్పాయి పండ్లు మనకు దాదాపుగా ఏడాది పొడవునా అన్ని సీజన్లలోనూ అందుబాటులో ఉంటాయి. కానీ బొప్పాయి పండ్లను మనం వర్షాకాలంలో ఎక్కువగా తినాల్సి ఉంటుంది. బొప్పాయి పండ్లను తినడం వల్ల అనేక పోషకాలు లభిస్తాయి. వర్షాకాలంలో ఈ పండ్లను తినాలా, వద్దా అని చాలా మంది సందేహిస్తుంటారు. కానీ ఈ పండ్లను ఈ సీజన్‌లోనే కచ్చితంగా తినాలని వైద్యులు సూచిస్తున్నారు. బొప్పాయి పండ్లలో అనేక ఎంజైమ్‌లు ఉంటాయి. ఇవి జీర్ణ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతాయి. బొప్పాయి పండ్లలో పపైన్, కైమో పపైన్ అనే ఎంజైమ్‌లు ఉంటాయి. ఇవి జీర్ణ రసాలు ఉత్పత్తి అయ్యేలా చేస్తాయి. మనం తిన్న ఆహారంలో ఉండే ప్రోటీన్లు, కొవ్వులను జీర్ణం చేయడంలో ఇవి సహాయం చేస్తాయి. వర్షాకాలంలో మన జీర్ణ వ్యవస్థ పనితీరు మందగిస్తుంది. కానీ బొప్పాయి పండ్లను తింటే జీర్ణ వ్యవస్థను యాక్టివ్‌గా ఉండేలా చేయవచ్చు. దీంతో ఆహారం సులభంగా జీర్ణం అవడమే కాదు, గ్యాస్, అసిడిటీ, కడుపు ఉబ్బరం, మలబద్దకం వంటి సమస్యలు తగ్గుతాయి.

**ఇన్ఫెక్షన్లకు చెక్..**

వర్షాకాలంలో ఫుడ్ పాయిజనింగ్ జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. కానీ బొప్పాయి పండును తింటే ఫుడ్ పాయిజనింగ్‌ను నివారిస్తుంది. ఇందుకు కారణం అయ్యే బ్యాక్టీరియా, ఇతర క్రిములను నాశనం చేసే గుణాలు బొప్పాయి పండ్లలో ఉంటాయి. ఈ పండ్లను తింటే విరేచనాలు తగ్గుతాయి. పొట్టలో ఉండే నులి పురుగులు సైతం నశిస్తాయి. మలబద్దకం ఉన్నవారు బొప్పాయి పండ్లను తింటుంటే ఫలితం ఉంటుంది. విరేచనం సాఫీగా అవుతుంది. పేగుల్లో ఉండే మలం పూర్తిగా బయటకు వస్తుంది. బొప్పాయి పండ్లలో విటమిన్ సి అధికంగా ఉంటుంది. విటమిన్ ఎ, విటమిన్ ఇ, ఫ్లేవనాయిడ్స్ తదితర యాంటీ ఆక్సిడెంట్లు కూడా ఈ పండులో అధికంగా ఉంటాయి. ఇవి వర్షాకాలంలో సహజంగానే మనకు వచ్చే ఇన్ఫెక్షన్లను తగ్గించడంలో సహాయం చేస్తాయి. ఈ సీజన్‌లో వచ్చే ఫ్లూ, దగ్గు, జలుబు వంటి ఇన్‌ఫెక్షన్లను తగ్గేలా చేస్తాయి. ఈ పండులోని విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు రోగ నిరోధక శక్తిని పెంచి వ్యాధులను తగ్గేలా చేస్తాయి. కనుక ఈ సీజన్‌లో బొప్పాయి పండ్లను విడిచిపెట్టకుండా తినాలని వైద్యులు సూచిస్తున్నారు.


**నొప్పులు, వాపులకు..**

బొప్పాయి పండ్లను తినడం వల్ల శరీరంలోని వాపులు, నొప్పుల నుంచి ఉపశమనం లభిస్తుంది. ఈ పండ్లలో ఉండే యాంటీ ఇన్ ఫ్లామేటరీ గుణాలు నొప్పులు, వాపులను తగ్గిస్తాయి. ఆర్థరైటిస్ నొప్పులు ఉన్నవారికి బొప్పాయి పండ్లు ఎంతగానో మేలు చేస్తాయి. బొప్పాయి పండ్లలో ఉండే విటమిన్లు ఎ, సి, ఇ చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచడంలో సహాయం చేస్తాయి. వర్షాకాలం కారణంగా గాలిలో తేమ అధికంగా ఉంటుంది. దీంతో చర్మం డల్‌గా మారుతుంది. కొందరికి దురదలు వచ్చే అవకాశాలు ఉంటాయి. అలాంటి వారు బొప్పాయి పండ్లను తింటుండాలి. లేదా వీటిని గుజ్జుగా చేసి ఫేస్ ప్యాక్‌లా కూడా ఉపయోగించవచ్చు. బొప్పాయి పండు ఫేస్ ప్యాక్‌ను వాడితే ముఖం కాంతివంతంగా మారి మెరుస్తుంది. యవ్వనంగా కనిపిస్తారు. మొటిమలు, మచ్చలు సైతం పోతాయి.

**బరువు తగ్గేందుకు..**

వర్షాకాలంలో తలెత్తే విరేచనాల సమస్య వంటి వాటి కారణంగా కొందరికి శరీరంలో ద్రవాలు త్వరగా బయటకు పోతాయి. అలాంటి వారు బొప్పాయి పండ్లను తింటుంటే ఫలితం ఉంటుంది. ఈ పండ్లలో ఉండే ఎంజైమ్‌లు జీవక్రియలను సరిగ్గా నిర్వహించడంలో సహాయం చేస్తాయి. దీంతో క్యాలరీలు సులభంగా ఖర్చవుతాయి. బరువు తగ్గుతారు. బరువు తగ్గాలనే డైట్‌లో ఉన్నవారు బొప్పాయి పండ్లను రోజూ తింటుంటే ఫలితం ఉంటుంది. ఈ పండ్లలో ఉండే విటమిన్ ఎ కంటి చూపును మెరుగు పరుస్తుంది. కళ్లను రక్షిస్తుంది. వయస్సు మీద పడడం వల్ల వచ్చే ముడతల సమస్య రాకుండా చూస్తుంది. బొప్పాయి పండ్ల గ్లైసీమిక్ ఇండెక్స్ (జీఐ) విలువ చాలా తక్కువగా ఉంటుంది. అందువల్ల షుగర్ ఉన్నవారు ఈ పండ్లను తిన్నా షుగర్ లెవల్స్ పెరగవు. పైగా ఈ పండ్లలో ఉండే ఫైబర్, యాంటీ ఆక్సిడెంట్లు షుగర్‌ను తగ్గించేందుకు సహాయం చేస్తాయి. కనుక డయాబెటిస్ ఉన్నవారు ఈ పండ్లను తింటే ఎంతో మేలు జరుగుతుంది. ఇలా బొప్పాయి పండ్లను వర్షాకాలంలో ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల అనేక ప్రయోజనాలను పొందవచ్చని పోషకాహార నిపుణులు సూచిస్తున్నారు.

# పర్వతపు అంచున పట్టాల పరుగు వెనుక..!



ఒక అత్యున్నత నిర్మాణం వెనుక తప్పకుండా ఒక అత్యుత్తమ కృషి ఉంటుంది. జమ్మూ- శ్రీనగర్‌లను అనుసంధానించేందుకు నిర్మించిన భూమి మీది అత్యంత ఎత్తయిన చీనాబ్ రైల్వే వంతెన వెనుక కూడా అలాంటి కష్టమే ఉంది. ప్రపంచాన్ని అబ్బురపరిచే ఈ నిర్మాణంలో తెలుగు వనిత డా? గాలి మాధవీలత పదిహేడేండ్ల శ్రమ దాగుంది. నేలకు వేల అడుగుల ఎత్తున పట్టాలు పెట్టించడానికి ఆమె బృందం ఎన్నుకున్న టెక్నిక్.. సివిల్ ఇంజినీరింగ్ విభాగంలోనే సరికొత్త మార్గంగా మారింది. అసాధ్యమనిపించే పనిని సుసాధ్యం చేసి చూపిస్తే అది చేసిన వారికే కాదు, చూసిన వారికీ ఆనందాన్ని కలిగిస్తుంది. హిమాలయ సానువుల్లో చీనాబ్ వంతెన మీదుగా రైలు ప్రయాణం చేసేవారు తప్పకుండా ఈ ఆనందానుభూతిని పొందుతారు. శత్రుదుర్భేద్యం అనదగిన కొండలను తొలిచి భారత్‌లోనే తొట్ట తొలిసారిగా నిర్మించిన స్టీల్ ఆర్క్ బ్రిడ్జ్ అది. చీనాబ్ నదీ పాయకు 1200 అడుగుల ఎత్తున, 4300 అడుగుల పొడవుతో దీన్ని నిర్మించారు. అయితే సాధారణంగా ఇప్పటిదాకా భారత్‌లో జరిగిన బ్రిడ్జిల నిర్మాణానికీ దీనికీ చాలా తేడా ఉంది. ఆకాశానికీ నేలకూ మధ్య దీన్ని నిర్మించాలంటే పర్వతాలు, రాళ్ల వాటి స్వభావాల్లాంటి అనేక విషయాల మీద లోతైన అవగాహన అవసరం. అందుకే ఐఐటీలో చదువుకుని, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ నుంచి రాక్ మెకానిక్స్‌లో పోస్ట్ డాక్టోరల్‌షిప్ చేసిన డా? మాధవీలత వంతెన నిర్మాణంలో కీలకంగా వ్యవహరించగలిగారు. ఈ ప్రాజెక్టులో కన్సల్టెంట్‌గా బాధ్యతలు నిర్వహించారామె. ఆమెది ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లా ఏడుగుండ్లపాడు.

**డిజైన్ యాజ్ యూ గో..**

పని ముందుకు వెళ్తున్న దాన్నిబట్టి వంతెనను డిజైన్ చేస్తూ పోవడమే అని చెప్పేదే మాధవీలత బృందం ఎంచుకున్న డిజైన్ యాజ్ యూ గో టెక్నిక్. మిగతా నిర్మాణాలు వాటి ప్రణాళికలకు దీనికీ అసలైన భేదం ఇక్కడే ఉంది. నేల స్వభావం, గట్టిదనం, నీరు పారే వేగం, దిశలాంటి వివిధ అంశాలను బట్టి సాధారణంగా ఇంజినీర్లు వంతెనల నిర్మాణానికి ప్లాన్ గీస్తుంటారు. అయితే ఇక్కడ పరిస్థితి వేరు. దీని గురించి మాధవీలత ఇండియన్ జియోటెక్నికల్ జర్నల్‌లో రాసిన అనుభవాల ప్రకారం%ొ% ఆ పర్వతాల మీద విభిన్నమైన రాళ్లు ఉన్నాయి. ముందుగా వాటి స్వభావాన్ని తెలుసుకోవాల్సి వచ్చింది. వాటి పటిష్టత కూడా పెద్ద అంశమే. దాని ఆధారంగానే స్టీలు యాంకర్లు వేయాల్సి ఉంటుంది. అయితే కొండల అంచున వేర్వేరు రాళ్లే కాదు, వాటిలో పెద్ద పెద్ద ఖాళీలు కూడా ఉన్నాయి. కాబట్టి వంతెనను నిలబెట్టడానికి ముందు వాటిని కాంక్రీట్‌తో నింపాల్సి వచ్చింది. మరో విషయం ఏంటంటే అంత ఎత్తున గాలి కూడా విపరీతమైన వేగంతో వస్తుంది. నిరంతరం అలాంటి గాలులకు వంతెన తట్టుకోవాలి. ఇవన్నీ దృష్టిలో పెట్టుకుని ఏ ప్రదేశంలో పనిచేస్తున్నాం, అక్కడి పరిస్థితులేంటి అన్నదాన్నిబట్టే వంతెనను డిజైన్ చేసుకుంటూ ముందుకు వెళ్లాం. నిర్దిష్టమైన ప్లాన్ పెట్టుకుని అలాగే వెళ్లాలంటే ఇక్కడ కుదరదు. అందుకే ఈ వంతెన రూపకల్పన (డిజైనింగ్) విషయంలో పనితోపాటు మార్పులు చేసుకునే పద్ధతినే అనుసరించారు. మరో విషయం ఏమిటంటే ఏకంగా రిక్టర్‌స్కేలు మీద 8 తీవ్రతలో ఇక్కడ భూకంపాలు వచ్చే అవకాశాలు ఎక్కువ. -20 డిగ్రీల అతి తక్కువ ఉష్ణోగ్రతలు%ొ% ఇవి కాక ఈ ప్రాంతంలో టెర్రరిస్టులు దాడికి తెగబడే అవకాశాలూ ఎక్కువే. అందుకే 63 మిల్లీమీటర్ల మందంతో కాంక్రీట్, స్టీల్ కలగలిపిన బ్లాస్ట్‌ప్రూఫ్ పిల్లర్లను నిర్మించారు. హిమాలయ పర్వతాల ఎత్తుపల్లాల్లో ప్రయాణించి సామగ్రిని చేర్చేందుకు తొలుత మార్గం లేదు. ఈ ప్రాజెక్టు నిర్మాణంలో నాది ఒక పాత్ర మాత్రమే. ముఖ్యంగా వాలు ప్రాంతాల్లో వంతెనను పటిష్ట పరిచే డిజైన్‌కు సంబంధించే నేను ఎక్కువ పనిచేశాను. అంత మాత్రాన నేనేదో గొప్ప అన్నట్టు ప్రచారం చేయడం సరికాదు. దీని నిర్మాణంలో వేల మంది పనిచేశారు. అందరూ ఈ ప్రశంసలకు అర్హులే! అప్పుడు గుర్రాలు, గాడిదలే వాహనాలు. ప్రస్తుతం జమ్మూ, శ్రీనగర్ నగరాల మీదుగా వెళ్లే విమానాల్లో ఈ వంతెన వచ్చినప్పుడు పైలట్లు ప్రత్యేక అనౌన్స్‌మెంట్ చేస్తున్నారు. ప్రయాణికులూ ఎంతో ఆసక్తిగా ఫొటోలు తీసుకుని ఆనందిస్తున్నారు. పదవల్లో వెళ్లి అంచనాలు వేసుకుని, తీవ్రమైన చల్లగాలులకు తట్టుకుంటూ, రోజుల తరబడి చంటిబిడ్డల్ని కూడా వదిలి తాను శ్రమించిన పని పూర్తవడం ఎంతో సంతోషంగా ఉందని చెబుతున్నారు మాధవీలత. త్వరగా కుటుంబంతో వంతెన మీదుగా ప్రయాణించాలని ఉవ్విళ్లూరుతున్నానంటూ తన ఆనందాన్ని పంచుకున్నారు.


## దాంపూర్ గ్రామ పంచాయతీలో
## 'డ్రాఫ్ట్ ఓటర్ లిస్ట్‌పై గ్రామసభ





**పోరు తెలంగాణ, మంచిర్యాల, ఆగష్టు 27:** దాంపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో గురువారం (27/08/2026) ఉదయం 9:00 గంటలకు సర్ -2026 డ్రాఫ్ట్ ఓటర్ లిస్ట్ పై ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. ఈ కార్యక్రమం దాంపూర్ గ్రామ సర్పంచ్ చెగొండ కుమార్ భీమారం తహసిల్దార్ సదానందం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించారు. సర్ -2026 డ్రాఫ్ట్ జాబితాను సభలో ప్రజలకు చదివి వినిపించారు. ఓటర్ల వివరాలపై ఉన్న సందేహాలు, అభ్యంతరాలు మరియు తప్పుల సవరణలపై గ్రామస్తులతో సమగ్రంగా చర్చించారు. ప్రజల నుంచి వచ్చిన సూచనలు, దరఖాస్తులను అధికారులు నమోదు చేసుకుని తగిన చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. గ్రామ పంచాయతీ ఆవరణలో మొక్కలను నాటి, ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్, వార్డు మెంబర్లు, పంచాయతీ కార్యదర్శి , బూత్ లెవెల్ ఆఫీసర్లు,అంగన్‌వాడీ టీచర్లు, పంచాయతీ సిబ్బంది, గ్రామ యువత, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## నిరుద్యోగులను మోసం చేసేవారిని ఉపేక్షించేది లేదు
## -- జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్



**కొత్తగూడెం ఆగస్టు 27 పోరు తెలంగాణ జిల్లా ప్రతినిధి:** కూరపాటి దాసు ప్రజల ఆర్థిక పరిస్థితులను ఆసరాగా చేసుకుని అధిక వడ్డీలకు రుణాలు ఇచ్చి, అనంతరం అధిక మొత్తాలను వసూలు చేస్తూ ఇబ్బందులకు గురిచేసే వ్యక్తులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ హెచ్చరించారు. అధిక వడ్డీలకు రుణాలు ఇచ్చి, రుణాలు చెల్లించలేని పరిస్థితుల్లో ప్రజలను బెదిరించడం, వేధింపులకు గురిచేయడం వంటి చర్యలకు పాల్పడే వ్యక్తులపై పోలీసు శాఖ ప్రత్యేక దృష్టి సారిస్తుందని తెలిపారు. ప్రజలు తమ ఆర్థిక అవసరాల కోసం ప్రైవేట్ వ్యక్తుల వద్ద రుణాలు తీసుకునే విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రుణం తీసుకునే ముందు వడ్డీ, తిరిగి చెల్లింపు విధానం తదితర వివరాలను పూర్తిగా తెలుసుకోవాలని తెలిపారు. అదేవిధంగా ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగాలు ఇప్పిస్తామని నిరుద్యోగ యువతను ప్రలోభాలకు గురిచేసి, వారి నుంచి డబ్బులు వసూలు చేసే మోసగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి ముందస్తుగా డబ్బులు వసూలు చేసే వ్యక్తుల మాటలు నమ్మవద్దని, ఉద్యోగాల కోసం ఎటువంటి ముందస్తు చెల్లింపులు చేయవద్దని తెలిపారు. ఉద్యోగాలకు సంబంధించిన వివరాలను సంబంధిత సంస్థల అధికారిక మార్గాల ద్వారా నిర్ధారించుకోవాలని సూచించారు. అక్రమంగా అధిక వడ్డీలు వసూలు చేస్తూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తు, ఉద్యోగాలు ఇప్పిస్తామని నిరుద్యోగులను మోసం చేస్తున్న వ్యక్తుల గురించి సమాచారం తెలిసిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా పోలీసు అధికారులకు తెలియజేయాలని జిల్లా ఎస్పీ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మోసపూరిత కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

## దాంపూర్ గ్రామంలో
## వైభవంగా ఇందిరమ్మ గృహప్రవేశం





**పోరు తెలంగాణ మంచిర్యాల ఆగస్టు 27:** భీమారం మండలం దాంపూర్ గ్రామపంచాయతీ పరిధిలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చెగొండ కుమార్ , కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పోడటి రవి , ఉప సర్పంచ్, వార్డు మెంబర్లు, గ్రామ కార్యదర్శి, అంగన్వాడీ టీచర్లు, బిఎల్వోలు , గ్రామ యువత గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని గృహ యజమానికి శుభాకాంక్షలు తెలిపారు.

## మోడల్ స్కూల్లో ఆకస్మిక తనిఖీ



**పోరు తెలంగాణ ఓదెల ప్రతినిధి రవీంద్ర చారి:** పెద్దపల్లి జిల్లా ఆగస్టు 27 గురువారం ఓదెల మోడల్ స్కూల్లో స్పెషల్ ఆఫీసర్ తాసిల్దార్ బి.వనజ నాయక్, (ప్రొబేషనరీ డిప్యూటీ కలెక్టర్) ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ తనిఖీ లో మోడల్ స్కూల్లో విద్యార్థులకు అందుతున్న నాణ్యమైన విద్య ప్రమాణాలు, మౌలిక వసతులు, పరిశుభ్రమైన మధ్యాహ్న బోజనం యొక్క నాణ్యత ను విద్యార్థిని విద్యార్థులను అడిగి తెలుసుకొని క్షుణ్ణంగా తనిఖీ చేసినారు. విద్యార్థులకు ఉన్నతమైన విద్యను అందించాలని సూచించారు.

# ఇన్వెస్టర్లు ఇక క్యాష్ రెడీ చేసుకోండి వచ్చేవారం మెగా ఐపీఓల జాతర

## ఆ ఒక్క ఐపీఓపైనే అందరి కన్ను

భారతదేశ ప్రాథమిక స్టాక్ మార్కెట్ మరో అత్యంత బిజీ వారానికి సిద్ధమవుతోంది. ఇప్పటికే 42 ప్రధాన కంపెనీలు ఐపీఓల ద్వారా రూ. 54,378 కోట్లు సమీకరించగా, ఆగస్టు 17 నుండి ఆగస్టు 21 మధ్య మరొక ఐదు కంపెనీలు తమ పబ్లిక్ ఇష్యూలను ప్రారంభించనున్నాయి. వీటి ద్వారా మొత్తం రూ. 5,499.32 కోట్లను సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నాయి. అదే సమయంలో.. ఇప్పటికే పబ్లిక్ ఇష్యూ పూర్తి చేసుకున్న మరో ఐదు కంపెనీల షేర్లు స్టాక్ మార్కెట్‌లో లిస్ట్ కానున్నాయి ఆగస్టు 17 సోమవారం నాడు హొరైజన్ ఇండస్ట్రియల్ పార్క్స్, లలితా జ్యువెలరీ మార్ట్ తమ ఐపీఓలను ప్రారంభిస్తున్నాయి. హొరైజన్ ఇండస్ట్రియల్ పార్క్స రూ. 2,600 కోట్లు సమీకరించాలని చూస్తోంది. ఈ వారంలో ం ఐదు ఐపీఓల మొత్తం నిధుల సమీకరణలో ఒక్క హొరైజన్ వాటాయే దాదాపు 47 శాతంగా ఉంది. ఈ కంపెనీ ఒక్కో షేరుకు రూ. 57 నుండి రూ. 60 ధరల శ్రేణిని నిర్ణయించింది. రెండవ అతిపెద్ద ఇష్యూగా వస్తున్న లలితా జ్యువెలరీ మార్ట్ రూ. 1,700 కోట్లను లక్ష్యంగా పెట్టుకుని.. ఒక్కో షేరు ధరను రూ. 190 నుండి రూ. 201గా నిర్ణయించింది. ఈ రెండు ఇష్యూలు ఆగస్టు 19 వరకు పెట్టుబడుల కోసం తెరిచి ఉంటాయి. ఆ కంపెనీల్లో భారీగా పెట్టుబడి పెట్టిన మ్యూచువల్ ఫండ్లు.. ఆగస్టు 18న శంకేష్ జ్యువెలర్స్, సన్‌షైన్ పిక్చర్స్ తమ ఇష్యూలను ప్రారంభించనున్నాయి.




శంకేష్ జ్యువెలర్స్ ఒక్కో షేరుకు రూ. 88 నుండి రూ. 93 ధరల శ్రేణితో రూ. 367.18 కోట్లు సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకోగా, సన్‌షైన్ పిక్చర్స్ ఒక్కో షేరుకు రూ. 342 నుండి రూ. 360 ధరల శ్రేణితో రూ. 282.14 కోట్లు సమీకరించాలని యోచిస్తోంది. ఈ రెండు ఇష్యూలు ఆగస్టు 20 వరకు అందుబాటులో ఉంటాయి. ఈ వారపు చివరి ఐపీఓ అయిన గజ ఆల్టర్నేటివ్ అసెట్ మేనేజ్‌మెంట్ సబ్‌స్క్రిప్షన్ ఆగస్టు 19న ప్రారంభమై ఆగస్టు 21న ముగుస్తుంది. ఈ కంపెనీ రూ. 550 కోట్లు సమీకరించాలని చూస్తుండగా, షేరు ధర ంరూ. 152 నుండి రూ. 160 మధ్య ఉంది. ఈ ఐదు కంపెనీల షేర్లు బీఎస్ఈ, ఎన్ఎస్ఈలలో లిస్ట్ కానున్నాయి. ఇన్వెస్టర్లు డబ్బులు రెడీ చేసుకోండి.. రూ. 1700 కోట్లు టార్గెట్‌తో కొత్త వచ్చేస్తోంది.. పూర్తి వివరాలు ఇవే మరోవైపు ఇప్పటికే ఐపీఓలను పూర్తి చేసుకుని.. సంయుక్తంగా రూ. 7,478.69 కోట్లు సమీకరించిన మరో ఐదు కంపెనీల షేర్లు ఈ వారం స్టాక్ మార్కెట్‌లో అరంగేట్రం చేయనున్నాయి. రూ. 3,066.89 కోట్లు సమీకరించిన ధూత్ ట్రాన్స్‌మిషన్, రూ. 939.70 కోట్లు సమీకరించిన మోల్బియో డయాగ్నోస్టిక్స్ ఆగస్టు 17న లిస్ట్ కానున్నాయి. రూ. 1,553 కోట్లు సమీకరించిన మిల్కీ మిస్ట్ డెయిరీ ఫుడ్ షేర్లు ఆగస్టు 18న మార్కెట్లోకి రానున్నాయి. అలాగే రూ. 1,617.48 కోట్లు సమీకరించిన షిప్‌రాకెట్, రూ. 301.62 కోట్లు సమీకరించిన బెహారీ లాల్ ఇంజనీరింగ్ కంపెనీల షేర్లు ఆగస్టు 19న స్టాక్ మార్కెట్‌లో లిస్ట్ కానున్నాయి. ఐదేళ్లలో రూ.23 నుంచి రూ.1,666 చేరిన మల్టీబ్యాగర్ స్టాక్ ఇదే.డిస్క్లైమర్: ఈ వెబ్‌సైట్‌లోని అభిప్రాయాలు, సూచనలు పూర్తిగా వ్యక్తిగత విశ్లేషకులు లేదా ఇతర సంస్థలవి మాత్రమే. ఇవి అధికారిక అభిప్రాయాలు కాదని గమనించగలరు.మేము ఈ విషయం యొక్క ఖచ్చితత్వం, సమగ్రత లేదా విశ్వసనీయతపై ఎటువంటి హామీ ఇవ్వడం కాని, అనుమతించడం కాని బాధ్యత వహించడం జరగదు. మేము ఎలాంటి పెట్టుబడి సలహా ఇవ్వము. అలాగే ఎటువంటి సెక్యూరిటీ కొనుగోలు లేదా అమ్మకాలు ప్రోత్సహించము. ఈ వెబ్‌సైట్‌లోని కథనం పూర్తిగా సమాచారం, విద్యా ప్రయోజనాల కోసమే అందించబడుతుంది. మీరు ఏదైనా పెట్టుబడి నిర్ణయం తీసుకునే ముందు, లైసెన్స్ పొందిన ఆర్థిక సలహాదారుల సహాయం తీసుకోండి. ఈ కథనాన్ని కేవలం సమాచారంగా మాత్రమే పరిగణించండి.

# హార్ముజ్ జలసంధిపై ట్రంప్ సంచలన ప్రకటన

## ఇంచు కూడా తాకలేరంటూ ఇరాన్ ఘాటు రిప్లై

అగ్రరాజ్యం అమెరికా- ఇరాన్‌తో సైనిక ఉద్రిక్తతలు, దౌత్యపరమైన వైఫల్యాలు కొనసాగుతున్న తరుణంలో, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలు అంతర్జాతీయంగా తీవ్ర కలకలం రేపాయి. న్యూయార్క్‌లోని లాంగ్ ఐలాండ్‌లో జరిగిన ఒక రిపబ్లికన్ ర్యాలీలో ఆయన ప్రసంగిస్తూ.. ప్రస్తుతం సాగుతున్న సంఘర్షణలో ఇరాన్‌ను ఓడించిన తర్వాత వ్యూహాత్మకంగా ఎంతో కీలకమైన హార్ముజ్ జలసంధిని అమెరికా సొంత భూభాగంగా ప్రకటిస్తానని స్పష్టం చేశారు. లాంగ్ ఐలాండ్ వేదికగా ట్రంప్ చేసిన ఈ ప్రకటన అంతర్జాతీయంగా సముద్ర వాణిజ్య వర్గాలలో, దౌత్య వర్గాల్లో విపరీతమైన చర్చకు దారితీసింది. ఈ ర్యాలీలో అధ్యక్ష సైనిక వ్యూహాలను వివరిస్తూ.. ప్రస్తుతం ఇరాన్ సైనిక బలగాలు తీవ్రంగా బలహీనపడ్డాయని ట్రంప్ వ్యాఖ్యానించారు. హార్ముజ్ జలసంధిపై అమెరికా నావికాదళానికి సంపూర్ణ నియంత్రణ ఉందని, ఈ వ్యూహాత్మక జలమార్గంపై తమ ఆధిపత్యాన్ని మరింత కట్టుదిట్టం చేస్తామని పేర్కొన్నారు. అంతేకాకుండా అంతర్జాతీయ సముద్ర మార్గంలో ఇరాన్‌ను నియంత్రించడానికి అమెరికా నావికాదళం విధించిన దిగ్బంధనాన్ని ఒక చొరబడలేని ఉక్కు గోడగా ఆయన అభివర్ణించారు. ఇరాన్ విడుదల చేస్తున్న ప్రకటనలు కేవలం మాటలకే పరిమితమవుతున్నాయని.. ఆ దేశ మిలిటరీ తీవ్రంగా దెబ్బతిని ప్రతిఘటించే శక్తిని కోల్పోయిందని ఆరోపించారు టన్నుల కొద్ది బంగారాన్ని ఇరాన్?కు చేర్చిన యూఏఈ.. ఎందుకంటే. అయితే ట్రంప్ చేసిన ఈ ప్రకటనలను ఇరాన్ ప్రభుత్వం తక్షణమే ఖండించింది. అమెరికా అధికారులు, ట్రంప్ చేస్తున్న వాదనల్లో ఎలాంటి వాస్తవం లేదని, ట్వీట్లు లేదా బెదిరింపులతో హార్ముజ్ జలసంధిని అమెరికా ఆక్రమించలేదని ఇరాన్ విదేశాంగ శాఖ స్పష్టం చేసింది. ఇరాన్ విధించిన షరతులను అమెరికా, అంతర్జాతీయ సమాజం ఆమోదించే వరకు హార్ముజ్ జలసంధిని తెరిచే ప్రసక్తే లేదని స్పష్టం చేసింది. జలసంధి ద్వారా నౌకాయానం ఇకపై మూసివేయబడలేదని వైట్ హౌస్ ప్రతినిధులు పదేపదే చెబుతున్నప్పటికీ.. క్షేత్రస్థాయిలో పరిస్థితి ఏమాత్రం మారలేదని ఇరాన్ స్పష్టం చేయడంతో రెండు దేశాల మధ్య తీవ్ర వ్యత్యాసాలు బయటపడ్డాయి. అమెరికాతో చర్చలపై ఇరాన్ సంచలన ప్రకటన.. హార్ముజ్ జలసంధి వద్ద తీవ్రరూపం దాల్చిన ఉద్రిక్తతలు.. హార్ముజ్ జలసంధిని పునఃప్రారంభించడంపై అమెరికా ఇరాన్ మధ్య దౌత్యపరమైన చర్చలు జరుగుతున్నప్పటికీ, అవి పురోగతి




సాధించడంలో విఫలమవుతున్నాయి. ప్రపంచంలో సరఫరా అయ్యే ముడి చమురులో దాదాపు 20 శాతం ఈ జలసంధి గుండానే రవాణా అవుతుంది. అటువంటి సున్నితమైన మార్గంలో ఉద్రిక్తతలు పెరగడం ంఅంతర్జాతీయ ఇంధన మార్కెట్లను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. ఇప్పటికే భద్రతా కారణాల రీత్యా అనేక వాణిజ్య చమురు నౌకలు తమ ప్రయాణ మార్గాలను మార్చుకోవడంతో సముద్ర రవాణా వ్యయం గణనీయంగా పెరిగింది. చర్చలపై ఇరాన్ సంచలన ప్రకటన.. మళ్ళీ భగ్గుమన్న ముడిచమురు ధరలు.. ఆగని హార్ముజ్ టెన్షన్.. మరోవైపు రష్యా చమురు కొనుగోళ్లపై 100 శాతం సుంకం విధించే బిల్లును అమెరికా సెనేట్ ఆమోదించడం వల్ల భారత్, చైనాల వంటి దిగుమతిదారులపై కూడా తీవ్ర ప్రభావం పడే ప్రమాదం ఏర్పడింది. అంతర్జాతీయంగా సంయమనం పాటించాలని దేశాలు పిలుపునిస్తున్నప్పటికీ. అమెరికా నావికా దిగ్బంధనం, ఇరాన్ మొండివైఖరితో ప్రాంతంలో తీవ్ర అస్థిరత కొనసాగుతోంది.

# పడిక్కల్ సూపర్ సెంచరీ గాలే టెస్టులో ముగిసిన తొలి రోజు ఆట

## శ్రీలంకతో తొలి టెస్టులో సెంచరీతో మెరిసిన దేవదత్ పడిక్కల్
## కండరాల నొప్పితో 77 పరుగుల వద్ద రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరిగిన కేఎల్ రాహుల్
## తొలి రోజు ఆట ముగిసేసరికి 2 వికెట్లకు 288 పరుగులు చేసిన భారత్
## వెలుతురు లేమి, వర్షం కారణంగా ముందుగానే ముగిసిన తొలి రోజు ఆట

శ్రీలంకతో జరుగుతున్న తొలి టెస్టులో భారత యువ బ్యాటర్ దేవదత్ పడిక్కల్ అద్భుత శతకంతో కదం తొక్కాడు. దాదాపు రెండేళ్ల తర్వాత టెస్టు జట్టులోకి వచ్చిన పడిక్కల్ (131 నాటౌట్), తన కెరీర్‌లో తొలి సెంచరీని నమోదు చేశాడు. అతనికి తోడు వైస్ కెప్టెన్ కేఎల్ రాహుల్ (77 రిటైర్డ్ హర్ట్) కూడా రాణించడంతో, శనివారం తొలి రోజు ఆట ముగిసే సమయానికి భారత్ పూర్తి ఆధిపత్యం ప్రదర్శించింది. వెలుతురు లేమి, వర్షం కారణంగా ఆటను ముందుగానే నిలిపివేసే సమయానికి టీమిండియా 73 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 288 పరుగులు చేసింది.గాలే అంతర్జాతీయ స్టేడియం వేదికగా జరుగుతున్న ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ బ్యాటింగ్ ఎంచుకున్నాడు. ఓపెనర్లు యశస్వి జైస్వాల్ (32), కేఎల్ రాహుల్ శుభారంభం అందించారు. అయితే, జైస్వాల్ రనౌట్‌గా వెనుదిరిగాడు. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన పడిక్కల్, రాహుల్‌తో కలిసి ఇన్నింగ్స్‌ను నిలబెట్టాడు. వీరిద్దరూ రెండో వికెట్‌కు కీలక భాగస్వామ్యం నెలకొల్పారు. అయితే, తీవ్రమైన కండరాల నొప్పితో కేఎల్ రాహుల్ రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరగాల్సి వచ్చింది.గాయపడిన సాయి సుదర్శన్ స్థానంలో జట్టులోకి వచ్చిన పడిక్కల్, లభించిన అవకాశాన్ని రెండు చేతులా అందిపుచ్చుకున్నాడు. క్రీజును చక్కగా ఉపయోగించుకుంటూ, అద్భుతమైన ఫుట్‌వర్క్‌తో లంక బౌలర్లను ఎదుర్కొన్నాడు. ముఖ్యంగా బ్యాక్ ఫుట్‌పై ఆకట్టుకునే షాట్లు ఆడాడు. 134 బంతుల్లో తన తొలి టెస్ట్ శతకాన్ని పూర్తి చేసుకున్నాడు. 2002లో సౌరవ్ గంగూలీ తర్వాత భారత జట్టులో మూడో స్థానంలో టెస్టు శతకం సాధించిన తొలి ఎడమచేతి వాటం బ్యాటర్‌గా పడిక్కల్ రికార్డు సృష్టించాడు.కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (16) ఎక్కువసేపు నిలవలేకపోయాడు. స్పిన్నర్ ప్రభాత్ జయసూర్య



బౌలింగ్‌లో అనవసర షాట్‌కు యత్నించి మిడ్-ఆఫ్‌కు క్యాచ్ ఇచ్చి ఔటయ్యాడు. అనంతరం క్రీజులోకి వచ్చిన రిషభ్ పంత్ (27 నాటౌట్) తనదైన శైలిలో దూకుడుగా ఆడాడు. పడిక్కల్‌తో కలిసి అజేయంగా 52 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు.వర్షం కారణంగా ఆట కాసేపు నిలిచిపోయినా, బ్యాటర్ల జోరు తగ్గలేదు. అయితే, వెలుతురు మందగించడంతో అంపైర్లు తొలి రోజు ఆటను 17 ఓవర్లు ముందుగానే ముగించారు. పడిక్కల్ 178 బంతుల్లో 12 ఫోర్లు, ఒక సిక్సర్‌తో 131 పరుగులు, పంత్ 36 బంతుల్లో 3 ఫోర్లు, ఒక సిక్సర్‌తో 27 పరుగులతో క్రీజులో ఉన్నారు. రెండో రోజు ఆట 15 నిమిషాలు ముందుగా ప్రారంభం కానుండగా, భారత్ 500 పైచిలుకు స్కోరుపై కన్నేసింది.ం

# రిలయన్స్, రోల్స్ రాయిస్ ఒప్పందం యుద్ధ
# విమానాలకు 'దేశీ' ఇంజిన్ తయారీ

యుద్ధ విమాన ఇంజిన్ తయారీకే పరిమితం కాకుండా భవిష్యత్తులో రక్షణ రంగం, సివిల్ ఏవియేషన్ రంగాలకు మార్గం సుగమం చేస్తుందని ఇరు కంపెనీల ప్రకటన.భారత రక్షణ రంగాన్ని సరికొత్త శిఖరాలకు తీసుకెళ్లేలా ఒక భారీ ఒప్పందం కుదిరింది. భారతదేశపు అతిపెద్ద ప్రైవేట్ రంగ సంస్థ రిలయన్స్ ఇండస్ట్రీస్, బ్రిటన్‌కు చెందిన ప్రపంచ ప్రసిద్ధ ఏరో ఇంజిన్ తయారీ సంస్థ రోల్స్-రాయిస్ ఒప్పందం కుదుర్చుకున్నాయి. ప్రతిష్ఠాత్మక ఐదో తరం స్టెల్త్ యుద్ధ విమాన ప్రాజెక్ట్ అయిన అడ్వాన్స్‌డ్ మీడియం కంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ కోసం స్వదేశీ యుద్ధ విమాన ఇంజిన్‌ను సంయుక్తంగా అభివృద్ధి చేయాలని భావిస్తున్నాయి. ఈ మేరకు శు క్రవారం ఓ సంయుక్త ప్రకటనను విడుదల చేశాయి. ఈ కూటమి కేవలం యుద్ధ విమాన ఇంజిన్ తయారీకే పరిమితం కాకుండా భవిష్యత్తులో రక్షణ రంగం, సివిల్ ఏవియేషన్, సరికొత్త పవర్, ప్రొపల్షన్ సిస్టమ్స్ వంటి విస్తృత భాగస్వామ్యాలకు కూడా మార్గం సుగమం చేస్తుందని ఇరు సంస్థలు తెలిపాయి.భారత్‌లో ప్రత్యేకంగా ఒక ఏరోస్పేస్ గ్యాస్ టర్బైన్ కాంప్లెక్స్ ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలిస్తున్నట్లు ఇరు సంస్థలు తమ ప్రకటనలో వెల్లడించాయి. దీనిని పవర్, ప్రొపల్షన్ టెక్నాలజీలో ఒక 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్'గా తీర్చిదిద్దనున్నారు. ఈ కాంప్లెక్స్‌లో యుద్ధ విమాన ఇంజన్లకు సంబంధించిన ఈ క్రింది అన్ని పనులను ఒకే చోట పూర్తి చేస్తారని పేర్కొంది. ఈ కేంద్రం ద్వారా యుద్ధ విమాన ఇంజిన్ల డిజైన్, అభివృద్ధి, తయారీ, ఉత్పత్తి, టెస్టింగ్, నిర్వహణ వంటి అన్ని కార్యకలాపాలనూ దేశీయంగానే చేపట్టాలని లక్ష్యంగా పెట్టుకున్నాయి. రక్షణ రంగంలో విదేశీ సరఫరాదారులపై ఆధారపడటాన్ని తగ్గించి, ఆత్మనిర్భరత సాధించాలన్న కేంద్ర ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా ఈ భాగస్వామ్యం కుదిరింది.ఈ




సందర్భంగా కీలకమైన సాంకేతికతల్లో స్వయం సమృద్ధి సాధించడం ఎంతో అవసరమని రిలయన్స్ ఇండస్ట్రీస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనంత్ అంబానీ అభిప్రాయపడ్డారు. రోల్స్-రాయిస్ ప్రపంచ స్థాయి నైపుణ్యం, రిలయన్స్ సామర్థ్యాలను కలిపి ప్రపంచస్థాయి ఏరో ఇంజిన్ వ్యవస్థను ఏర్పాటు చేస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. తమ భాగస్వామ్యం ఏరోస్పేస్ రంగంలో భారత్ స్వయం సమృద్ధి సాధనలో మైలురాయిగా నిలుస్తుందని రోల్స్ రాయిస్ సీఈఓ తుఫాన్ ఎర్గెన్‌బిల్గిక్ అన్నారు. "భారతదేశం వ్యూహాత్మక సార్వభౌమత్వాన్ని సాధించాలంటే ఇలాంటి క్లిష్టమైన సాంకేతికతల్లో స్వంత సామర్థ్యం కలిగి ఉండటం చాలా అవసరం. రోల్స్-రాయిస్ నైపుణ్యాన్ని, రిలయన్స్ సాంకేతికత, ఉత్పాదకత, భారీ స్కేల్, అమలు సామర్థ్యాలతో అనుసంధానించడం ద్వారా భారతదేశంలోనే ఒక బలమైన ఏరో-ఇంజన్ వ్యవస్థను నిర్మిస్తాం. ఇది రాబోయే రోజుల్లో దేశాన్ని స్వయంసమృద్ధిగా మార్చడమే కాకుండా ప్రపంచస్థాయిలో పోటీ పడేలా చేస్తుంది."అనంత్ అంబానీ, రిలయన్స్ ఇండస్ట్రీస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్.ప్రస్తుతానికి రెండు కంపెనీలు తమ వ్యూహాత్మక ఉద్దేశాన్ని మాత్రమే ప్రకటించాయి. ఇది ఇంకా పూర్తి స్థాయి జాయింట్ వెంచర్?గా లేదా అధికారిక కాంట్రాక్ట్‌గా మారలేదు. ఆ గ్యాస్ టర్బైన్ కాంప్లెక్స్ ఏర్పాటు దిశగా వేసిన మొదటి అడుగు మాత్రమే. ఈ ప్రతిపాదిత ప్రాజెక్ట్‌కు సంబంధించిన ఆర్థిక పెట్టుబడుల వివరాలను, కాలపరిమితిని లేదా ఇరు కంపెనీల వాటాల వివరాలను ప్రస్తుతానికి ఇరు సంస్థలు వెల్లడించలేదు."అడ్వాన్స్‌డ్ మీడియం కాంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్' అనేది భారతదేశం స్వదేశీ సాంకేతికతతో తయారు చేస్తున్న ఐదో తరం స్టెల్త్ యుద్ధ విమాన ప్రాజెక్ట్. శత్రువుల రాడార్లకు కూడా చిక్కకుండా దాడి చేయగల సామర్థ్యం దీని సొంతం.

# ఏపీలో మహిళల క్రికెట్‌కు కొత్త శకం
# మంగళగిరి వేదికగా ఉమెన్స్ ఏపీఎల్

## ఆంధ్రప్రదేశ్‌లో మహిళల ప్రీమియర్ లీగ్ నిర్వహణకు ఏర్పాట్లు . సెప్టెంబర్ 15 నుంచి 26 వరకు
## మంగళగిరిలో టోర్నీ . మొత్తం 4 జట్లు.. ఇప్పటికే పూర్తయిన బిడ్డింగ్ ప్రక్రియ . లీగ్‌కు మద్దతు
## ప్రకటించిన మాజీ కెప్టెన్ మిథాలీ రాజ్ . ఒక జట్టును రూ.89 లక్షలకు దక్కించుకున్న ఉషోదయ ఎంటర్‌ప్రైజెస్



ఆంధ్రప్రదేశ్‌లో మహిళల క్రికెట్‌ను ప్రోత్సహించే దిశగా ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) కీలక ముందడుగు వేసింది. పురుషుల కోసం విజయవంతంగా నిర్వహిస్తున్న ఆంధ్ర ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్) తరహాలోనే తొలిసారిగా 'మహిళల ఏపీఎల్' నిర్వహించనున్నట్లు ప్రకటించింది. ఏసీఏ అధ్యక్షుడు, విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని ఈ విషయాన్ని అధికారికంగా వెల్లడించారు. ఈ టోర్నమెంట్ సెప్టెంబర్ 15 నుంచి 26 వరకు మంగళగిరి వేదికగా జరగనుంది.ఈ లీగ్‌లో మొత్తం నాలుగు జట్లు పోటీపడనున్నాయి. ఇప్పటికే జట్ల కోసం బిడ్డింగ్ ప్రక్రియ కూడా పూర్తయిందని కేశినేని చిన్ని తెలిపారు. ఉషోదయ ఎంటర్‌ప్రైజెస్ సంస్థ ఒక జట్టును రూ.89 లక్షల అత్యధిక బిడ్‌తో దక్కించుకుంది. మిగిలిన జట్లను కూడా ఇతర సంస్థలు సొంతం చేసుకున్నాయి.ఈ ప్రకటన సందర్భంగా భారత మహిళా క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ మిథాలీ రాజ్ కూడా పాల్గొంది. మహిళల కోసం ప్రత్యేకంగా లీగ్ నిర్వహించడంపై ఆమె హర్షం వ్యక్తం చేసింది. ప్రస్తుతం దేశంలో మహిళల క్రికెట్‌కు ఆదరణ బాగా పెరిగిందని, ఈ లీగ్ ద్వారా ఆంధ్రప్రదేశ్ నుంచి ఎంతోమంది ప్రతిభావంతులైన క్రీడాకారిణులు వెలుగులోకి వస్తారని ఆశాభావం వ్యక్తం చేసింది. జాతీయ జట్టుకు ఎంపికయ్యేందుకు ఇది ఒక మంచి వేదికగా ఉపయోగపడుతుందని అభిప్రాయపడింది.ప్రస్తుతానికి ప్రతి జట్టు రెండేసి మ్యాచ్‌లు ఆడుతుందని, భవిష్యత్తులో ప్రేక్షకుల ఆదరణను బట్టి జట్ల సంఖ్యను పెంచే ఆలోచన ఉందని నిర్వాహకులు తెలిపారు. ఈ లీగ్‌లో ఆడేందుకు ఇప్పటికే దాదాపు 200 మంది క్రీడాకారిణులు తమ పేర్లను నమోదు చేసుకోవడం విశేషం.

# బెంగళూరులో కనిపించిన బంద్ ప్రభావం
# యథావిధిగా నడుస్తున్న బస్సులు, మెట్రో

కావేరీ వాటర్ మేనేజ్‌మెంట్ అథారిటీ ఆదేశాలకు నిరసనగా రైతులు, వివిధ కన్నడ సంఘాలు ఈ రోజు కర్ణాటక బంద్‌కు పిలుపునిచ్చాయి. ఆగస్టు 12 నుంచి 15 రోజుల పాటు తమిళనాడుకు రోజుకు 12,000 క్యూసెక్కుల నీటిని విడుదల చేయాలని జారీ చేసిన ఆదేశాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ,




కన్నడ అనుకూల సంఘాలు, కార్యకర్తలు రాష్ట్రవ్యాప్తంగా 12 గంటల పాటు నిరసన కార్యక్రమాన్ని చేపట్టాయి. ఉదయం 6:00 గంటల నుంచి సాయంత్రం 6:00 గంటల వరకు బంద్ కొనసాగనుంది.బంద్ నేపథ్యంలో పాఠశాలలు, కళాశాలలు, కార్యాలయాలు, దుకాణాలు, వాణిజ్య సంస్థలు, ప్రజా రవాణా, ఇతర సాధారణ కార్యకలాపాలు యథావిధిగా కొనసాగుతాయని బెంగళూరు నగర పోలీసులు స్పష్టం చేశారు. ప్రైవేట్ రవాణా సేవలు కూడా యథావిధిగా పనిచేస్తాయని భావిస్తున్నారు. కర్ణాటక శాసనసభ 10 రోజుల వర్షాకాల సమావేశాలు ప్రారంభం కానున్న తరుణంలో ఈ బంద్ పిలుపు వచ్చింది. బంద్‌లో పాల్గొనాలని, దుకాణాలు లేదా సంస్థలను మూసివేయాలని, వాహనాల రాకపోకలకు ఆటంకం కలిగించాలని లేదా ఇష్టం లేకపోయినా నిరసనల్లో పాల్గొనాలని ఎవరినీ బలవంతం చేయకూడదని లేదా బెదిరించకూడదని పోలీసులు హెచ్చరించారు. కర్ణాటక ప్రభుత్వం కీలక నిర్ణయం.. గుట్కా, పాన్ మాసాలపై నిషేధం.. నగరంలో శాంతి, ప్రజా భద్రత, సాధారణ పరిస్థితులను కాపాడటంలో బెంగళూరు నగర పోలీసులకు సహకరించాలని అన్ని సంస్థలను, ప్రజలను బెంగళూరు పోలీసులు కోరారు. పాఠశాలలు, కళాశాలలు, కార్యాలయాలు, దుకాణాలు, వాణిజ్య సంస్థలు, ప్రజా రవాణా, ఇతర సాధారణ కార్యకలాపాలు యథావిధిగా కొనసాగుతాయని పోలీసులు ప్రకటించారు. మెట్రో రైళ్లు కూడా నడుస్తాయని చెప్పారు. ప్రజలు ఎటువంటి భయం లేదా ఆందోళన లేకుండా తమ దైనందిన కార్యకలాపాలను యథావిధిగా కొనసాగాలని కోరారు. బెంగళూరు మెట్రోపాలిటన్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ , కర్ణాటక స్టేట్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ ఉద్యోగుల సంఘాలు ఈ బంద్‌కు దూరంగా ఉన్నాయి.ఆగస్టు 13న సుప్రీంకోర్టులో జరగనున్న విచారణకు ముందు, రాష్ట్రానికి ఎటువంటి అన్యాయం జరగకుండా కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రభుత్వం చూసుకుంటుందని కర్ణాటక మంత్రి రామలింగ రెడ్డి స్పష్టం చేశారు. తమిళనాడు పిటిషన్ దాఖలు చేసిందని.. తమకు నోటీసు అందిందని పేర్కొన్నారు. డిస్క్లైమర్: ఈ వెబ్‌సైట్‌లోని అభిప్రాయాలు, సూచనలు పూర్తిగా వ్యక్తిగత విశ్లేషకులు లేదా ఇతర సంస్థలవి మాత్రమే. ఇవి అధికారిక అభిప్రాయాలు కాదని గమనించగలరు.మేము ఈ విషయం యొక్క ఖచ్చితత్వం, సమగ్రత లేదా విశ్వసనీయతపై ఎటువంటి హామీ ఇవ్వడం కాని, అనుమతించడం కాని బాధ్యత వహించడం జరగదు. మేము ఎలాంటి పెట్టుబడి సలహా ఇవ్వము. అలాగే ఎటువంటి సెక్యూరిటీ కొనుగోలు లేదా అమ్మకాలు ప్రోత్సహించము. ఈ వెబ్‌సైట్‌లోని కథనం పూర్తిగా సమాచారం, విద్యా ప్రయోజనాల కోసమే అందించబడుతుంది. మీరు ఏదైనా పెట్టుబడి నిర్ణయం తీసుకునే ముందు, లైసెన్స్ పొందిన ఆర్థిక సలహాదారుల సహాయం తీసుకోండి. ఈ కథనాన్ని కేవలం సమాచారంగా మాత్రమే పరిగణించండి.

# హార్ముజ్ జలసంధి తెరవాలంటే ఈ షరతులు ఒప్పుకోవాల్సిందే

## ట్రంప్‌కు డెడ్ లైన్ పెట్టిన ఇరాన్



ప్రపంచంలోనే అత్యంత కీలకమైన ఇంధన రవాణా మార్గమైన హార్ముజ్ జలసంధి ద్వారా వాణిజ్య నౌకల రాకపోకలను పునరుద్ధరించడానికి ఇరాన్ ఆరు షరతులను విధించింది. ఈ జలసంధిని తిరిగి తెరవాలంటే అమెరికా తన వైఖరిని మార్చుకోవాలని స్పష్టం చేస్తూ.. వాషింగ్టన్ ముందు ఆరు ప్రధాన డిమాండ్లను ఉంచినట్లు ఇరాన్ సుప్రీం నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ మాజీ కార్యదర్శి, సుప్రీం లీడర్ అయతోల్లా అలీ ఖమేనీ సలహాదారు అయిన మొహమ్మద్ బఘేర్ జోల్ఘదర్ వెల్లడించారు. మరోవైపు ఈ మార్గంలో వాణిజ్య నౌకల నిర్వహణ కోసం ఒమన్‌తో ఉమ్మడి సాంకేతిక ఒప్పందాన్ని కుదుర్చుకోవడానికి ఇరాన్ చేరువైంది. ప్రతిపాదిత ఒప్పందం ప్రకారం రవాణా నిర్వహణలో టెహ్రాన్, మస్కట్‌లకు ఉమ్మడి బాధ్యతలు ఉంటాయి. అయితే ఒమన్‌తో ఒప్పందం కుదిరినంత మాత్రాన జలసంధి తెరుచుకోదని.. తమ ఆరు పొలిటికల్ డిమాండ్లను పరిష్కరిస్తేనే సాధారణ నౌకాయానం సాధ్యమవుతుందని ఇరాన్ విదేశాంగంశ మంత్రి అబ్బాస్ అరాఘ్చి స్పష్టం చేశారు. హార్ముజ్ జలసంధిపై ట్రంప్ సంచలన ప్రకటన.. ఇంచు కూడా తాకలేరంటూ ఇరాన్ ఘాటు రిప్లై.. ఇరాన్ విధించిన 6 ప్రధాన డిమాండ్లు: 1. బెదిరింపులు నిలిపివేత: ఇరాన్‌పై అమెరికా తన బెదిరింపు ధోరణిని, అవమానకరమైన భాషను శాశ్వతంగా మానుకోవాలి. 2. ప్రాంతీయ వివాదాల ముగింపు: లెబనాన్, పాలస్తీనా, యెమెన్ మరియు ఇరాక్‌లలో ఇరాన్ మరియు దాని మిత్రదేశాలపై అమెరికా సాగిస్తున్న సైనిక దురాక్రమణను తక్షణమే ముగించాలి. 3. నావికా దిగ్బంధనం ఎత్తివేత: ఇరాన్ చుట్టూ ఉన్న ప్రాంతాల నుండి అమెరికా నావికా, వైమానిక దళాలను ఉపసంహరించుకోవడంతో పాటు విధించిన నావికా దిగ్బంధనాన్ని ఎత్తివేయాలి. 4. యుద్ధ పరిహారం: ఇటీవల జరిగిన రెండు యుద్ధాలలో (2025లో జరిగిన 12 రోజుల యుద్ధంతో సహా) ఇరాన్‌కు జరిగిన ఆస్తి, ప్రాణ నష్టానికి అమెరికా భారీ పరిహారం చెల్లించాలి. 5. ఆంక్షల రద్దు: ఇరాన్‌పై విధించిన క్రూరమైన, చట్టవిరుద్ధమైన ఆర్థిక ఆంక్షలను తక్షణమే తొలగించాలి. 6. స్తంభింపజేసిన ఆస్తుల విడుదల: విదేశాలలో జప్తు చేసిన లేదా స్తంభింపజేసిన ఇరాన్ నిధులను, ఆస్తులను బేషరతుగా విడుదల చేయాలి. చర్చలపై ఇరాన్ సంచలన ప్రకటన.. మళ్ళీ భగ్గుమన్న ముడిచమురు ధరలు.. ఆగని హార్ముజ్ టెన్షన్.. చర్చలపై ఇరాన్ సంచలన ప్రకటన.. మళ్ళీ భగ్గుమన్న ముడిచమురు ధరలు.. ఆగని హార్ముజ్ టెన్షన్.. పర్షియన్ గల్ఫ్, అరేబియా సముద్రాన్ని కలిపే ఈ 33 కిలోమీటర్ల ఇరుకైన జలసంధి నిలిచిపోవడం వల్ల గ్లోబల్ ఎనర్జీ మార్కెట్ తీవ్ర ఆందోళన చెందుతోంది. యూఎస్ ఎనర్జీ ఇన్ఫర్మేషన్ అడ్మినిస్ట్రేషన్ ప్రకారం.. ఈ జలసంధి గుండా రోజుకు సుమారు 20 మిలియన్ బ్యారెళ్ల చమురు రవాణా అవుతుంది. ఇందులో 82 శాతం ఆసియా దేశాలకే వెళ్తుంది. ముఖ్యంగా ఇరాన్ ఎగుమతి చేసే మొత్తం చమురులో 90 శాతాన్ని చైనానే కొనుగోలు చేస్తోంది. ఈ జలసంధి మూసివేత వల్ల ఆసియా రిఫైనరీలు తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొనే ముప్పు ఏర్పడింది. ఇరాన్ షరతుల వార్తలతో అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు ఒక్కసారిగా 3 శాతం పెరిగాయి. బ్రెంట్ క్రూడ్ బ్యారెల్‌కు వి86.03 డాలర్లకు చేరుకోగా.. యూఎస్ వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియట్ 80.61 డాలర్లకి పెరిగింది. మరోవైపు ఇరాన్‌గుండా వెళ్లే నౌకలను స్వయంగా పర్యవేక్షించడమే కాకుండా రుసుములు వసూలు చేయాలని యోచిస్తుండటంపై షిప్పింగ్ పరిశ్రమ వర్గాలు చట్టపరమైన, బీమా సంబంధిత ఆందోళనలను వ్యక్తం చేస్తున్నాయి. వైట్ హౌస్ ఈ విధివిధానాలను గమనిస్తుండగా.. అంతర్జాతీయ సమాజం ఇరాన్-అమెరికా మధ్య తదుపరి దౌత్యపరమైన పరిణామాల కోసం ఉత్కంఠగా ఎదురుచూస్తోంది.